

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | బుధవారం 19-8-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:15 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## అమిత్‌షాకు మరోమారు అస్వస్థత

### హుటాహుటిన ఎయిమ్స్‌లో చేరిక
### ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యుల ప్రకటన

న్యూఢిల్లీ,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మరోమారు అస్వస్థతకు గురయ్యారు. ఆయన ఒంటి నొప్పులతో బాధపడుతుండగా మంగళవారం ఢిల్లీలోని ఏయిమ్స్‌లో చేరారు. శ్వాసకోస సంబంధ సమస్యతో కూడా బాధపడుతున్నట్లు సమచారం. ఇటీవల కరోనా పాజిటివ్‌గా పరీక్షించడంతో ఆయన గురుగ్రామ్‌లో మేదాంత దవాఖానలో చికిత్స తీసుకున్నారు. ఈ నెల 2న ఆయన మేదాంతలో కరోనాతో చేరారు. తరవాత కరోనా నెగెటివ్ రావడంతో ఆస్పత్రి నుంచి డిశ్జార్జ్ అయ్యారు. తాజాగా శ్వాసకోశ ఇబ్బందులు రావడంతో ఏయిమ్స్‌లో చేరారు. ఆగస్టు 2న కేంద్రమంత్రికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయిన విషయం తెలిసిందే. విషయాన్ని ఆయన ట్విట్టర్ ద్వారా ధ్రువీకరించారు. వైద్యుల సలహా మేరకు దవాఖానలో చేసి చికిత్స తీసుకున్నారు. ఈ నెల 14న నిర్వహించిన కొవిడ్ పరీక్షల్లో నెగెటివ్ వచ్చినట్లు ఆయన ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. తాజాగా శ్వాసకోశ సమస్యలు ఎదురవడంతో ఏయిమ్స్‌లో చేరారు. ఈ మేరకు ఏయిమ్స్ ఓ ప్రకటనవిడుదల చేసింది. మూడు నాలుగు రోజులుగా అమిత్ షా అలసట, ఒంటి నొప్పులతో బాధపడుతున్నారని హాస్పిటల్ చైర్‌పర్సన్ డాక్టర్ ఆర్తి విజ్ తెలిపారు. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని, హాస్పిటల్ నుంచే పనిని కొనసాగిస్తారని పేర్కొన్నారు. కాగా, అమిత్ షా సోమవారం ఓ ప్రైవేటు దవాఖానలో సిటీ స్కాన్ చేసుకోగా, పరీక్షా ఫలితాల్లో ఛాతిలో ఇన్ఫెక్షన్ ఉందని తెలిసిందని, దీంతో ఆయన వైద్యుల సలహా మేరకు ఏయిమ్స్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఛాతి నిపుణుడు, ఏయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా పరిశీలనలో షా ప్రస్తుతం ఉన్నట్లు సమాచారం



.వరంగల్‌లో భారీ వర్షాలకు నీటమునిగిన ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్న మంత్రులు కెటిఆర్, ఈటెల రాజేందర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్ తదితర ప్రజాప్రతినిధులు

## నాలాల ఆక్రమణల వల్లనే వరద ప్రమాదం

### ఆక్రమణల తొలగింపునకు ప్రజలు సహకరించాలి
### బాధితులను ఆదుకుంటామని మంత్రి కెటిఆర్ హామీ
### మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలసి వరంగల్‌లో సుడిగాలి పర్యటన
### హెలికాప్టర్ ద్వారా ఏరియల్ వ్యూ చేపట్టిన కెటిఆర్

వరంగల్,ఆగస్ట్ 18(ఆర్ఎన్ఎ): నాలాలు,చెరువులను ఆక్రమించుకుని కట్టడాలు చేపట్టడం వల్లనే వరంగల్ నగరం నీటమునిగిందని మంత్రి కెటిఆర్ సహా పలువురు మంత్రులు అభిప్రాయపడ్డారు. కబ్జాలను తొలగిస్తే తప్ప వరంగల్‌కు ముక్తి లేదని కెటిఆర్ అన్నారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలకు వరంగల్ నగరం అతలాకుతమైంది. సీఎం కేసీఆర్ ఆదేశాలతో మంత్రి కేటీఆర్, సహచర మంత్రి ఈటల రాజేందర్‌తో కలిసి వరంగల్ నగరాన్ని ఏరియల్ వ్యూ ద్వారా వీక్షించారు. అనంతరం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో దిగారు. అక్కడి నుంచి నయీం నగర్, కేయూ 100ఫీ ట్ రోడ్ మొదలైన వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. వీరివెంట మంత్రులు ఎర్రబెల్లి దయాకర్రావు, సత్యవతి రాథోడ్,చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ కూడా ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో పర్యటించి స్థానిక ప్రజలను సమస్యలను అడిగి తెలుసు కున్నారు. వర్షం కారణంగా జరిగిన నష్టానికి అందరిని ప్రభుత్వం ఆదుకుంటుందని, మరోసారి ఈ సమస్య రాకుండా శాశ్వత పరిష్కారం చేస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. నాలాల వెంట అక్రమ నిర్మాణాలు చేయడం వల్లే ఈ సమస్య వచ్చిందని, ఈ అక్రమ నిర్మాణాలు అన్నిటినీ తొలగిస్తామని, ఇందుకు ప్రజలు సహకరించాలని మంత్రి కేటీఆర్ కాలని ప్రజలను కోరారు. వర్షాల కారణంగా నష్టపోయిన వారిని ఆదుకోవడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు బండ ప్రకాష్, పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, చల్లా ధర్మారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ గుండా ప్రకాష్ రావు, కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, జిల్లాల అధికారులు పాల్గొన్నారు. తాత్కాలిక సాయం చేయడంతో పాటు శాశ్వత పరిష్కారం అందిస్తావన్నారు. వరదల్లో సర్వస్వం కోల్పోయిన బాధితులకు నిత్యావసర సరుకులు అందించాలని అధికారులను కెటిఆర్ ఆదేశించారు.

### ఎంజిఎంలో పరామర్శ

కరోనా నియమాలు పాటిస్తూ ఎంజీఎం దవాఖానలో కొవిడ్ వార్డులోకి వెళ్లి కరోనా బాధితులను మంత్రి కెటిఆర్ తదితరులు పరామర్శించారు. కరోనా సోకితే భయపడొద్దని ధైర్యంగా కరోనాను ఎదుర్కోవాలని బాధితులకు ధైర్యం చెప్పారు. కరోనా పేషెంట్ల కోసం అదనంగా 150 పడకలను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. అవసరమైన ఆక్సిజన్ వెంటి లెటర్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ప్రత్యేక కొవిడ్ హాస్పిటల్‌గా కేఎంసీని త్వరలో ప్రారంభిస్తామని మంత్రి కేటీఆర్ వెల్లడించారు.

## ఇప్పట్లో భారత్ పాక్ సీరిస్ అసాధ్యం

### ప్రకటించిన పాక్ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్

ఇస్లామాబాద్,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): చాలా మంది పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు కొంతకాలంగా భారత్-పాకిస్తాన్ల మధ్య ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్ కోసం డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ ప్రధాని, మాజీ క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్.. భారత్-పాకిస్తాన్ మధ్య క్రికెట్ సిరీస్ పై ఓప్రకటన చేశారు. ప్రస్తుత పరిస్థితులలో ఈ రెండు దేశాల మధ్య క్రికెట్ సిరీస్ సాధ్యం కాదని తేల్చిచెప్పారు.

భారత్, పాకిస్తాన్ మధ్య చివరి ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్ 2012-13లో జరిగింది. పరిమిత ఓవర్ల సిరీస్ కోసం భారత్ లో పాకిస్తాన్ పర్యటించింది. అప్పటి నుండి రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్ జరుగలేదు. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) గురువు ఇమ్రాన్ ఖాన్ ఒక డాక్యుమెంటరీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో.. భారత్ తో క్రికెట్ సిరీస్ సాధ్యం కాదని స్పష్టంచేశారు. 'భారత్-పాకిస్తాన్ సంబంధాలు ప్రస్తుతానికి చెత్తగా ఉన్నాయి. అటువంటి పరిస్థితిలో ఈ రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్ కోసం వాతావరణం సరైనది కాదు. అలాంటి పరిస్థితిలో సిరీస్ ఆడటం భయపెట్టేదిగానే ఉంటుంది. ఈ ద్వైపాక్షిక సిరీస్ కోసం భారత ప్రభుత్వం ఎప్పటికీ అనుమతి ఇవ్వదు' అని చెప్పారు. పాకిస్తాన్ ప్రపంచ కప్ విజేత కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్.. భారత్ లో రెండు సిరీస్లు ఆడారు. 'మొదట నేను 1979 లో భారతదేశాన్ని సందర్శించాను. ఆ సమయంలో ఇరు దేశాల ప్రభుత్వాలు సంబంధాలను మెరుగుపర్చడంలో నిమగ్నమయ్యాయి. క్రికెట్ గొప్ప వాతావరణం కలిగి ఉంది. ప్రేక్షకులు రెండు జట్లను ఉత్సాహపరిచారు. అలాగే, నా కెప్టెన్సీలో బృందం 1987 లో భారతదేశాన్ని సందర్శించినప్పుడు వాతావరణం బాగా లేదు. రెండు దేశాల మధ్య ఉద్రిక్తత కారణంగా, ప్రేక్షకుల ప్రవర్తన కూడా చెడుగా ఉన్నది. మేము చాలా వ్యతిరేకతను ఎదుర్కోవలసి వచ్చింది' అని పేర్కొన్నారు. పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్.. ఇండియా-పాకిస్తాన్ సిరీస్‌ను యాషెస్ సిరీస్ కంటే పెద్దదిగా అభివర్ణించారు. యాషెస్ సిరీస్ ముఖ్యం, కాని భారత్-పాకిస్తాన్ సిరీస్‌తో సరిపోలడం లేదని ఆయన అన్నారు.

## మేఘాలయ గవర్నర్‌గా సత్యపాల్ మాలిక్

న్యూఢిల్లీ,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): గోవా గవర్నర్ సత్యపాల్ మాలిక్‌ను మేఘాలయ గవర్నర్‌గా నియమిస్తూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సత్యపాల్ మాలిక్ జమ్ముకశ్మీర్, బిహార్ గవర్నర్‌గా పని చేశారు. 2018 ఆగస్టులో మాలిక్ జమ్మూకశ్మీర్ గవర్నర్ గా విధులు నిర్వర్తించారు. అయితే జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను ఇచ్చే ఆర్టికల్ 370 ను రద్దు చేసిన తరువాత 2019 అక్టోబర్ లో సత్యపాల్ మాలిక్ ను గోవా గవర్నర్ గా నియమించారు. ఉత్తరప్రదేశ్ కు చెందిన మాలిక్ 1974-77 మధ్య ఎంఎల్ఎ గా పని చేశారు. 1980-86, 1986-89 వరకు ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. 1989-1991 వరకు ఆయన అలీగఢ్ నుంచి లోక్ సభ సభ్యుడిగా పని చేశారు. 2017లో మాలిక్ బిహార్ గవర్నర్ గా నియమితులయ్యారు. ఒడిశా కు గవర్నర్ గా కూడా ఆయన అదనపు బాధ్యతలు సైతం నిర్వహించారు. ఇదిలా ఉండగా గతంలో మాలిక్ గవర్నర్ వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలు సంచలనమయ్యాయి. గవర్నర్లకు పెద్ద పని ఏదీ ఉండదని, గవర్నర్‌గా పని చేసే వారు వైన్ తాగి, గోల్ఫ్ ఆడుతారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో దేశంలో గవర్నర్ వ్యవస్థపై చర్చ కూడా జరిగింది.

## విద్యాశాఖగా మారిన హెచ్‌ఆర్‌డి

### రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదముద్ర

న్యూఢిల్లీ,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖను విద్యాశాఖగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల మారుస్తూ తీసుకున్న నిర్ణయానికి రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ఆమోద ముద్ర వేశారు. ఈ మేరకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కేంద్రం కొత్త జాతీయ విద్యావిధానం తీసుకొచ్చింది. దీనికి జూలైలో కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. అనంతరం దీన్ని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించింది. దీంతో దీనికి రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. 1985లో రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో విద్యా మంత్రిత్వ శాఖను మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖగా పేరు మార్చారు. అనంతరం ఎన్ఇపిని ప్రవేశ పెట్టి 1992లో దీనికి సవరణలు చేశారు. హెచ్‌ఆర్‌డికి తొలి మంత్రిగా పివి నరసింహారావు పని చేశారు. ఇటీవల కేఉంద్రం ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరి రంగన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సంస్కరళ కమిటీ తొలుత మంత్రిత్వ శాఖ పేరును మార్చాలని కేంద్రానికి సూచించింది. 2018లో ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ చైర్మన్ రామ్ బహదూర్ రాయ్ కూడా హెచ్‌ఆర్ డి పేరును మార్చాలని సూచించారు. దీంతో 2020 జూలైలో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో కొత్త జాతీయ విద్యావిధానాన్ని కేంద్రం తీసుకొచ్చింది.

## రాజీవ్ ఖేల్‌రత్న అవార్డుకు రోహిత్ నామినేట్

న్యూఢిల్లీ,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): రాజీవ్‌గాంధీ ఖేల్ రత్న అవార్డుకు నలుగురు క్రీడాకారులను సెలక్షన్ కమిటీ నామినేట్ చేసింది. క్రికెటర్, టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు రెజ్లర్ వినేష్ పోగట్, టీటీ ప్లేయర్ మానికా బత్రా, పారాఒలింపిక్ స్వర్ణపతక విజేత మరియప్పన్ తంగవేలు ఉన్నారు. క్రీడా మంత్రిత్వశాఖకు చెందిన సెలక్షన్ కమిటీ ఈ నలుగురి పేర్లను సూచించింది. అత్యున్నత క్రీడా అవార్డుకు నలుగురు క్రీడాకారులు నామినేట్ కావడం ఇది రెండవసారి. 2016లో కూడా నలుగురు క్రీడాకారుల్ని ఈ అవార్డు కోసం నామినేట్ చేశారు. సెలక్షన్ కమిటీలో వీరేంద్ర సెహ్వాగ్, మాజీ హాకీ కెప్టెన్ సర్దార్ సింగ్‌లు ఉన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయంలో మంగళవారం కమిటీ భేటీ అయ్యింది.

గత ఏడాది రోహిత్ శర్మ బ్యాటింగ్‌లో మెరుపులు మెరిపించాడు. 2019 సీజన్‌లో రోహిత్ వన్డేల్లో ఏడు సెంచరీలు చేశాడు. మొత్తం 1490 రన్స్ చేశాడు. ఇక రెజ్లర్ వినేశ్ ఫోగట్.. 2018 కామన్‌వెల్త్, ఏషియా గేమ్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. ఒకవేళ రోహిత్‌కు ఖేల్ రత్న అవార్డు దక్కితే.. అప్పుడు ఆ అవార్డును అందుకున్న నాలుగవ క్రికెటర్‌గా అతను నిలుస్తాడు. ఇప్పటివరకు సచిన్, ధోనీ, కోహ్లీలు ఈ అవార్డును గెలచుకున్నారు. అయితే 2016లో షట్లర్ పీవీ సింధు, జిమ్నాస్ట్ దీపా కర్మాకర్, షూటర్ జీతూ రాయ్, రెజ్లర్ సాక్షీ మాలిక్‌లకు సంయుక్తంగా ఖేల్ రత్న అవార్డును బహూకరించారు.

## ఏజెన్సీ గ్రామాల్లో కరోనా కలకలం

### పునరావాస కేంద్రాల్లో జనం ఒకేచోట చేరడంతో భయం

భద్రాచలం,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): ఒక పక్క కరోనా.. మరోవైపు గోదారి వరదలతో జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలు వణుకుతున్నాయి. కరోనా నియంత్రణకు భౌతిక దూరం పాటించాలి. కానీ వరదముంపుతో ఇళ్లు ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు వెళితే అక్కడ గుంపులుగా జనం ఉండాల్సి వస్తోంది. దీంతో భౌతిక దూరం సాధ్యం కాని పరిస్థితి నెలకొంది. వరదనీరు ఇళ్లలోకి చేరుతుండడంతో వందలాది మంది ఇళ్లు ఖాళీ చేసి పిల్లలు, వృద్ధులతో ఇబ్బంది పడుతున్నారు. అందరూ ఒకేచోట చేరడంతో పునరావాస కేంద్రాల్లోనూ సరైన సౌకర్యాలు ఉండడం లేదు. దీనికి తోడు కరోనా భయంతో కొంతమంది తమ ఇంటి దరిదాపుల్లోనే రోడ్లపై సామగ్రి పెట్టుకుని ఉంటున్నారు. గ్రామాల్లోకి వరద నీరు రావడంతో లోతట్టు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, సర్వీసు వైర్లు వరదనీటికి తాకి ప్రమాదం జరగకుండా ఆ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో రాత్రివేళల్లో గ్రామాలన్నీ అంధకారంలో మగ్గుతున్నాయి. ఇక ముంపు ప్రాంతాల్లో గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు మేత లేక అలమటిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో అయితే మేతకు వెళ్లిన పశువులు చేల వద్దే వరదలో చిక్కుకున్నాయి. రదనీటితో పాటు పాములు, విషపురుగులు కూడా ఇళ్లలోకి వస్తున్నాయి. దీంతో వరద బాధితులు భయాందోళనలకు గురవుతున్నారు. భద్రాచలం రెవెన్యూ డివిజన్‌లోని పినపాక, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని సుమారు 85 గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి. ఆయా గ్రామాల్లో 100కు పైగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, సుమారు రెండు వేల కుటుంబాలకు ఆశ్రయం కల్పించారు. బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్యసేవలు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వరద ముంపు ప్రాంతాలను, పునరావాస కేంద్రాలను ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, కలెక్టర్ ఎం.వి.రెడ్డి, ఐటీడీఏ పీఓ గౌతమ్, అదనపు కలెక్టర్లు కర్నాటి వెంకటేశ్వర్లు, అనుదీప్ సందర్శించారు. బాధితులకు మెరుగైన సేవలందించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. బూర్గంపాడు మండలంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఐటీసీ పీఎస్‌పీడీ భోజనం అందిస్తోంది.



న్యూఢిల్లీలో ప్రధాని మోడీని కలుసుకున్న కాగ్ ఆడిటర్ జనరల్ గిరిష్ చంద్ర ముర్ము

## ప్రధాని మోదీని కలిసిన కాగ్ ముర్ము

న్యూఢిల్లీ, ఆగష్టు 18: కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) గిరీష్ చంద్ర ముర్ము ప్రధాని నరేంద్ర మోదీని మంగళవారం కలిశారు. కేంద్రపాలిత ప్రాంతమైన జమ్ముకశ్మీర్‌కు తొలి లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఏడాది పాటు ఉన్న ఆయన ఈ నెల 8న ఆ పదవికి రాజీనామా చేసి కాగ్ బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ముర్ము సోమవారం రాష్ట్రపతి భవన్‌ను సందర్శించి రామ్‌నాథ్ కోవింద్‌ను కూడా కలిశారు. గిరీష్ చంద్ర ముర్ము దేశానికి 14వ కాగ్‌గా నియమితులయ్యారు.

## 30న మన్ కి బాత్.. సలహాలు కోరిన మోదీ

న్యూఢిల్లీ,ఆగష్టు 18: ప్రతి నెల మాదిరిగానే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. ఈ నెల 30 న దేశ ప్రజలతో మాట్లాడబోతున్నారు. ఇది ప్రధాని యొక్క రేడియో కార్యక్రమం 68 వ ఎడిషన్ అవుతుంది. ఈ సంచికలో చర్చ కోసం, ఆలోచనలు, సలహాలను పంచుకోవాలని ప్రధాని దేశ ప్రజలను కోరారు.

ప్రధాని స్వయంగా ట్వీట్ చేసి దేశవాసుల నుంచి తమ అభిప్రాయాలను కోరుతున్నారు. ఈ నెల 30న జరగనున్న 'మన్ కి బాత్' సందర్భంగా ఏ విషయంపై చర్చిస్తే బాగుంటుందని మీరు భావిస్తున్నారు. 1800-11-7800 డయల్ చేయడం ద్వారా మీ సందేశాన్ని రికార్డ్ చేయవచ్చు. లేదా నమో యాప్ లేదా మై గవ్ లో కూడా సందేశాలు పంపవచ్చు. ఇందు కోసం ఫోన్ లైన్లు ఆగస్టు 10 నుంచి తెరిచి ఉంచారు.కార్గిల్ విజయ్ దివాస్ 21 వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన 67 వ ఎడిషన్‌లో ప్రసంగించిన ప్రధాని మోదీ.. పాకిస్థాన్‌ను లక్ష్యంగా చేసుకుని దుర్మార్గుల స్వభావం కారణం లేకుండా ప్రతి ఒక్కరికీ శత్రుత్వం కలిగించడమేనని అన్నారు. ఇదే సమయంలో కరోనా నుంచి మనం చాలా అప్రమత్తంగా ఉండాలని, ఫేస్ మాస్క్ ధరించడం, భౌతిక దూరంలో ఉండటం, తరచుగా చేతులు కడుక్కోవడం, ఎక్కడైనా ఉమ్మివేయకుండా చూడటం, శుభ్రతను పూర్తిగా చూసుకోవడం వంటివి పాటించడం వల్ల మనం కరోనా నుంచి బయటపడొచ్చని సూచించారు. మనకు సేవలందిస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర ఆరోగ్యకార్యకర్తలను నిత్యం గుర్తుంచుకోవాలని కోరుతున్నాను అని చెప్పారు.

## చరిత్రలో నేటినిజం






(ఆగష్టు 19 శంకర దయాళ్‌శర్మ జననం)

-రాధశ్రీ

సెల్: 9494481210

## రాష్ట్రానికి అవసరమైన ఎరువుల సరఫరా

### -కేంద్రమంత్రి సదానందతో నిరంజన్ రెడ్డి భేటీ

న్యూఢిల్లీ,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి సదానంద గౌడతో ఢిల్లీలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్రానికి కేటాయించాల్సిన ఎరువులపై కేంద్ర మంత్రితో చర్చించారు. ఈ సందర్భంగా సదానందగౌడను శాలువాతో సత్కరించారు. అనంతరం నిరంజన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. దేశంలో 60శాతం మంది ప్రజలకు వ్యవసాయరంగం ఉపాధి కల్పిస్తుందని, దాన్ని కాపాడే బాధ్యత తమదేననని కేంద్రమంత్రి చెప్పారని నిరంజన్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ రైతులకు వెన్నుదన్నుగా ఉంటామని, ఇచ్చిన మాటకు అనుగుణంగా ఎరువులు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. కరోనా, వర్షాలు, కూలీల కొరత నేపథ్యంలో ఎరువుల సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. గతేడాది కంటే వంద రెట్ల వినియోగం పెరిగినా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తెలంగాణ వ్యవసాయ శాఖ నిద్రాహారాలు మాని రైతుల సంక్షేమానికి పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఎరువులకు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. 18వేల మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ రాష్ట్రంలో అందుబాటులో ఉందని చెప్పారు. రైతులకు ఎరువులకు కొరత లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కేంద్ర మంత్రిని కలిసి రాష్ట్రానికి రావాల్సిన ఎరువుల కోటా విడుదలకు ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తమకు అవసరమైన యూరియా కేటాయిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర మంత్రికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపినట్లు నిరంజన్‌రెడ్డి చెప్పారు.

## కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి కన్నుమూత

### -సిఎం కెసిఆర్ తదితరుల సంతాపం

హైదరాబాద్,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి అనారోగ్యంతో కన్నుమూశారు. గత కొంత కాలంగా ఆయన గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. హైదరాబాద్ లోని ఒమేగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం తుది శ్వాస విడిచారు. కల్వకుర్తి ఎమ్మెల్యేగా రెండుసార్లు పని చేశారు. 1994-94 లో ఇండిపెండెంట్‌గా గెలుపొంది ఎమ్మెల్యేగా సేవలందించారు. రెండోసారి 2004-09 కాంగ్రెస్ తరపున గెలుపొందారు. కిష్టారెడ్డి మృతిపై పలువురు ప్రజాప్రతినిధులు సంతాపం ప్రకటించారు. సిఎం ఎసిఆర్ ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతిని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి మరణం జిల్లా ప్రజలకు తీరని లోటని ఎక్సైజ్ శాఖ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తన నియోజకవర్గ అభివృద్ధికి కిష్టారెడ్డి ఎంతగానో కృషి చేసినట్లు తెలిపారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం అప్పటి ప్రభుత్వాలను ఆయన నిలదీశారని ఆయన సేవలను గుర్తు చేశారు. ఆయన ఏ రాజకీయ పక్షంలో ఉన్నా ప్రజాపక్షమే తన తుది ప్రస్థానం అనేవారన్నారు. ఈ సందర్భంగా ఎడ్మ కిష్టారెడ్డి కుటుంబ సభ్యులకు మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## గిరిజనుల ఆరోగ్య సంరక్షణకు స్వాస్థ్య ఈ-పోర్టల్

### -ప్రారంభించిన కేంద్రమంత్రి అర్జున్ ముండా

న్యూఢిల్లీ,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): గిరిజనుల ఆరోగ్య సంరక్షణ కోసం 'స్వాస్థ్య' ఈ-పోర్టల్‌ను కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ ముండా మంగళవారం ఆవిష్కరించారు. దేశంలోని గిరిజనులకు ఆరోగ్యం, పోషకాహారం సంబంధిత సమాచారాన్ని ఈ పోర్టల్ ద్వారా అందుబాటులో ఉంచుతారు. ఇటువంటి పోర్టల్ రావడం ఇదే మొదటిసారి. ఆరోగ్యం, పోషకాహారంపై గిరిజనులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు 'స్వాస్థ్య' ఈ-పోర్టల్, 'ఆలేఖ్' అనే ఈ-న్యూస్ లెటర్, నేషనల్ ఓవర్సీస్ పోర్టల్, నేషనల్ ట్రైబల్ ఫెలోషిప్ పోర్టల్‌లను అర్జున్ ముండా ప్రారంభించారు. అనంతరం అర్జున్ ముండా మాట్లాడుతూ, ప్రజారోగ్యం ప్రమాణాలు కాలం గడుస్తున్నకొద్దీ మెరుగవుతున్నాయని, అయినప్పటికీ, గిరిజనులు, గిరిజనేతరుల మధ్య వ్యత్యాసాలు ఇంకా ఉన్నాయని చెప్పారు. ఈ అంతరాన్ని నిర్మూలించేందుకు గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉందని చెప్పారు. 'స్వాస్థ్య' పోర్టల్ చాలా బాగా వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. మన దేశ గిరిజనులకు సేవ చేయాలన్న గొప్ప లక్ష్యం దిశగా ఈ పోర్టల్ ఒక ముందడుగు అని చెప్పారు. ఫేస్‌బుక్‌తో కలిసి 'గోయింగ్ ఆన్‌లైన్ యాజ్ లీడర్స్' గోల్ అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గిరిజన యువత తమకు నైపుణ్యం ఉన్న రంగాల్లో నాయకులుగా ఎదిగేందుకు ఇది దోహదపడుతుందని చెప్పారు.

# కబ్జాలపై హైకోర్టు హెచ్చరికలు అమలయ్యేనా ?

నేటినిజం

బుధవారం 19-8-2020

గతంలో హైదరాబాద్..ఇప్పుడు వరంగల్ నగరం.. చెరువులు, నాలాల కబ్జాల కారణంగా ముంపునకు గురయ్యింది. గతంలో ఇదే తరహాలో హైదరాబాద్ కూకట్‌పల్లి, నిజాంపేట తదితర ప్రాంతాలు నిండా మునిగాయి. ఆరా తీస్తే చెరువులు కబ్జా అయ్యాయని గుర్తించారు. చర్యలు తీసుకుంటామని పాలకులు హామీ ఇచ్చారు. హడావిడి చేశారు. కానీ ఇప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు వరంగల్ వంతు వచ్చింది. ఎంతగా అంటే వరంగల్ నగరం నీట మునిగి నీళ్లల్లో పట్టణం తేలియాడుతున్నట్లుగా ఉంది. ప్రజలు నీటిలోనే కాలం గడపాల్సిన దుస్థితిలో ఉంది. దీనికతంటికి కారణం నాలాల కబ్జా, చెరువుల కబ్జా అని మంత్రులే స్వయంగా వెల్లడించారు. మంత్రి కెటిఆర్ తదితర మంత్రులు పర్యటించిన సందర్భంగా ఇదే విషయాన్ని మంత్రి కెటిఆర్ స్వయంగా వెల్లడించారు. నాలాలు కబ్జాచేస్తే ఇలాగే ఉంటుందన్నారు. అక్రమ కట్టడాలు పూర్తిగా తొలగిస్తే తప్ప ముప్పుపోదన్నారు. నిజంగా అలాంటి సంకల్పమే ఉంటే కబ్జాలకు గురైన చెరువులను పునరుద్దరించాలి. కబ్జాకోరులు ఎవరైనా చర్య తీసుకోవాల్సిందే. ఇదే సమయంలో హైకోర్టు సోమవారం చేసిన వ్యాఖ్యలు ఇక్కడ గమనించాలి. చెరువులు కబ్జా కాకుండా రక్షించకపోతే తెలంగాణ కూడా రాజస్థాన్ ఎడారిలా మారుతుందని హైకోర్టు హెచ్చరించింది. చెరువులను కాపాడేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. చెరువులు, కుంటలను కాపాడేందుకు అనుసరిస్తున్న విధానాలు, గైడ్‌లైన్స్ ఏమిటో చెప్పాలని అడిగింది. చెరువుల రక్షణకు డీఎస్పీ స్థాయి పోలీస్ అధికారి సభ్యుడిగా ఉండేలా ప్రొటెక్షన్ కమిటీలు వేయాలని గతంలో తాము ఇచ్చిన ఉత్తర్వులను ఎంత వరకు అమలు చేశారో చెప్పాలని కోరింది. ఒక్క రంగారెడ్డి జిల్లాలోని చెరువుల ఆక్రమణలపై 5 పిల్స్ వచ్చాయంటే ఆక్రమణలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోందని వ్యాఖ్యానించింది. రంగారెడ్డి జిల్లాలో చెరువులు కబ్జా అవుతుంటే కలెక్టర్ ఏం చేస్తున్నారు? కబ్జాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలంటే కలెక్టర్ ఎందుకు బద్ధకిస్తున్నారు? ఎఫ్‌టీఎల్ ఖరారుకు ప్రభుత్వ విధానాలు ఏమిటి? పోలీసుల ప్రమేయం లేకుండా కబ్జాలను అడ్డుకోవడం కష్టం. కమిటీలో డీఎస్పీ ఉన్నారా? లేదా? పూర్తి వివరాలతో వచ్చే నెల 6 లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని బెంచ్ ఆదేశించింది. ఇదే సందర్భంలో వరంగల్ నగరం నీట మునగడానికి కబ్జాలే కరాణమని మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్‌లో సోమవారం వ్యాఖ్యానించారు. అలాగే మంగళవారం నాటి పర్యటనలో కూడా మంత్రి కెటిఆర్ ఇవే వ్యాఖ్యలు చేశారు. ఆరోపణలు సరే ఏరకమైన చర్యలు తీసుకుని నగరాలను కాపాడుతారన్నది ముఖ్యం. ఇకపోతే ఇటీవలి వర్షాలకు వరంగల్ మహానగరం ఇంకా జలదిగ్బంధంలోనే ఉంది. విషయం విదితమే. వరంగల్, హన్మకొండ, కాజీపేట ట్రైసిటీస్‌లోని పలు కాలనీలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలే కాకుండా ఈసారి ప్రధాన కాలనీలు కూడా ఇంకా జల దిగ్బంధం నుంచి బయట పడలేదంటే పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుంది. ఇకపోతే పోటెత్తిన వరద లోతట్టు ప్రాంతాల ప్రజలకు తీరని వేదన మిగిల్చింది. వరుణుడు కొంత కరుణించినప్పటికి జనజీవనం గాడిన పడలేదు. లోతట్టు ప్రాంతాల ప్రజలు వరద నీటిలో మగ్గుతున్నారు. నిత్యావసర వస్తువులు తడిసిపోయి, విష సర్పాల నడుమ అర్ధాకలితో అలమటిస్తున్నారు. గ్రేటర్ వరంగల్ పాలక, అధికార వర్గాలు అందిస్తున్న సహాయక చర్యలు కొంత ఉపశమనం కలిగించి నప్పటికీ.. ఇళ్ల చుట్టూ వరద నీరు చేరడంతో ప్రజలు బయటకు రాలేక అవస్థలు పడ్డారు. అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వల్ల మురుగు కాల్వలు పొంగి పొర్లాయి. ప్రధానమైన నాలాలు ద్వారా ఆ వరద నీరు వెళ్లకపోగా నేరుగా కాలనీల్లోకి ప్రవేశించాయి. ఇంకా ప్రధాన రహదారులు సైతం చెరువులను తలపిస్తున్నాయి. హన్మకొండ హంటర్ రోడ్డులో ఎటు చూసినా వరద నీరు నిలిచి ఉన్నాయి. బొందివాగు నాలా నీరు సవ్యంగా వెళ్లకపోవడంతో సమీపంలోని ఉన్న కాలనీలను వరద ఎటుచూసిన బురదమయమైన కాలనీలు, దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీలు, సాయం కోసం బాధి తుల ఆక్రందనలు.. ఇలా ఒకటేమిటి.. అనేక సమస్యలతో జనజీవనం అతలా కుతలమైంది. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలు వరంగల్ మహానగరాన్ని ముంచెత్తిన ముంచెత్తింది. మరోవైపు గోదావరి, ఇంద్రావతి నదులు ఉధృతంగా ప్రవహిస్తుం డటంతో లోతట్టు తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముంపునకు లోనయ్యే ఇళ్ల వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. పరిస్థితిపై ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా సమీక్షించి కెటిఆర్‌ను, ఈటెల రాజేందర్‌ను పురమాయించి వరంగల్ పరిస్థితిని చూసి రమ్మని పంపారు. మరోవైపు అధికార యంత్రాంగం సహాయక చర్యలు ముమ్మరం చేసింది. వరద నీటిలో చిక్కుకు పోయిన ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేం దుకు నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు (ఎన్‌డీఆర్‌ఎఫ్) బృందాలు రంగంలోకి దిగాయి. వరద సహాయక చర్యల్లో భాగంగా పడవలను ఉపయోగించడం నగర చరిత్రలో ఇదే మొదటి సారి కాగా, అనేక ప్రాంతాలు వరద తాకిడి నుంచి ఇప్పుడిప్పుడే కోలుకునే పరిస్థితి కనిపించడం లేదు. మంత్రులు కెటిఆర్, ఈటల రాజేందర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌లు, చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్, వరంగల్ నగర మేయర్ గుండా ప్రకాశ్‌రావు, కమిషనర్ పమేలా సత్పతి నగరంలో పర్యటించి పలు కాలనీలు, ముంపు ప్రాంతాలను సందర్శించారు. సహాయక చర్యలు ముమ్మరం చేశారు. బాధితులకు భరోసా ఇచ్చారు. కబ్జాలను నిరోధిస్తేనే ముంపు ముప్పు నుంచి బటపడతామన్న మంత్రి కెటిఆర్ ఎలాంటి పరిష్కారం చూపుతారన్నది ముఖ్యం. వరంగల్ ముంపు సమస్యలకు ఎలాంటి పరిష్కారం చూపుతారో చూడాలి. అలాగే ఇది అన్ని నగరాలకు వర్తిస్తుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు నగరాల్లో చెరువులు ఆక్రమణలకు గుయ్యాయి. చెరువుల కబ్జాలపై తీవ్రంగా చర్యలు తీసుకుంటామని గతంలోనే ప్రకటించిన సిఎం కెసిఆర్ అందుకు తగ్గట్లుగా కఠినంగా వ్యవహరిస్తే తప్ప పరిస్థితి అదుపులోకి రాదు.

# మానవత్వ పూవ్వులను వికసింపజేద్దాం

**(19 ఆగష్టు ప్రపంచ మానవతా దినం సందర్భంగా)**

జీవకోటిలో మనిషి మాత్రమే ప్రత్యేక జీవి. మాట్లాడగలడు, ఆలోచించగలడు, సహాయం చేయగలడు, పరహితం కోరగలడు. గతాన్ని పునాదిగా చేసుకుంటూ, వర్తమానాన్ని మార్చుకుంటూ, భవిష్యత్తును తనకు అనుకూలంగా నిర్మించుకోగలడు. జంతువులన్నీ నాలుగు కాళ్ళతో భూమికి సమాంతర శరీరం కలిగి ఉంటాయి. మనిషి మాత్రమే రెండు కాళ్ళ మీద ధరణికి నింగిన ముద్దాడుతూ నిలబడగలడు. మనిషి ప్రకృతి ప్రేమికుడు. ప్రకృతి లేకుండా మనిషి లేడు. ప్రకృతిని పరిహసించిన మనిషి వికృత పరిణామాలను ఎదుర్కోవలసిందే. విశ్వంలో జరిగే ప్రతి మంచిచెడులకు కారణం మనిషే. జీవితంలోని జయాపజయాలకు కారణం అతనే. మనిషిని మనిషి ఆదుకుంటే మానవత్వం. మానవత్వం విరబూయడమే దైవత్వం. మనిషిని మనిషే మోసగిస్తూ దోచుకుంటే రాక్షసత్వం, అరాచకత్వం. ఆధునిక సాంకేతిక ప్రగతికి మరియు కరోనా లాంటి కల్లోలానికీ మనిషి అనాలోచిత స్వార్థ చేష్టలే కారణం. ప్రళయంలోనూ, మహమ్మారి విజృంభనలోనూ మనిషి తన కర్తవ్యాలను గుర్తు చేసుకుంటూ, మానవాళి క్షేమంగా బయట పడే మార్గాలను వేతుక్కోవాలి. మనిషిలో మానవత్వం పరిమళించిన నాడు లోకమంతా సుఖశాంతులతో స్వర్గతుల్యం అవుతుంది. మానవత్వ ఛాయలు లేని మానవ సమాజంలో మనుషులు క్రూరజంతువుల్లా మారి అరాచకత్వం రాజ్యమేలుతుంది. మానవత్వ ప్రాధాన్యతను గుర్తించిన అంతర్జాతీయ సమాజం ప్రతి ఏటా 19 ఆగష్టు రోజున "ప్రపంచ మానవతా దినాన్ని" పాటించడం హర్షదాయకం. సమాజహితం కోరి, నిస్వార్థంగా మానవత్వాన్ని తమ భుజాన వేసుకొని, తమ జీవితాన్ని సమాజానికి అంకితం చేసుకునే లక్ష్యంగల మానవతామూర్తులకు కృతజ్ఞతలను తెలుపుకుంటూ, వారిలోని దైవత్వాన్ని ఆరాదిస్తూ, మానవత్వ అవసరాన్ని సమాజానికి తెలియజేసే ప్రత్యేక ప్రయత్నాలు ఈ రోజున చేపడతారు.

సమాజం సంక్షోభంలో పడినపుడు, తోటి మనిషి అపాయంలో చిక్కినపుడు స్పందిస్తూ చేయూత నిచ్చే మానవతామూర్తులు నేటికీ మన మధ్య ఉండడం సంతోషదాయకం. 19 ఆగష్టు 2003 రోజున బాగ్దాద్ పట్టణంలోని 'హోటల్ కనాల్'లో జరిగిన బాంబు పేలుడులో ఐరాస మానవ హక్కుల హై కమిషనర్ 'సెర్జియో వీరా డీ మెల్లో'తో పాటు 22 మంది మానవతామూర్తులు ప్రాణాలు కోల్పోయారు. దీనికి గుర్తుగా ఐరాస జనరల్ అసెంబ్లీ 2009లో తీసుకున్న తీర్మానం ప్రకారం 19 ఆగష్టు 2010 నుండి ప్రపంచ మానవతా దినం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. యుద్ధాలు, వైరస్ విధ్వంసాలు, కరువుకాటకాలు, అశాంతి, ఆకలి చావులు లాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినపుడు మానవత్వ ధారలే మనవాళిని బతికించగలవని నమ్మాలి. స్వచ్ఛంద సేవకులతో పాటుగా రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్స్, రొటేరీ క్లబ్స్ లాంటి అనేక స్వచ్ఛంద సంస్థలు పలు సంక్షోభ సందర్భాలలో మానవత్వాన్ని ఆసరాగా చేసుకొని లోక మానవాళిని ప్రమాదాలలోంచి, సంకటస్థితిలోంచి బయట పడేస్తున్నారు. వీరు చూపిన మానవత్వమే రేపటి సమాజ సౌభాగ్యానికి ఊపిరిగా నిలుస్తోంది. ఇలాంటి మానవతామూర్తులను గుర్తించి సన్మానించుకోవడం మన కనీస కర్తవ్యమని మరువరాదు.

2019లో జరిగిన 277 సంఘటనలలో సిరియా, సూడాన్, కాంగో, అఫ్ఘానిస్థాన్ యెమన్, మాలి లాంటి దేశాలలో 483 సమాజ మానవతా సేవకులపై దాడులలో 125 మంది మరణించగా, 234 మంది గాయపడడం విచారకరం. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం 1,009 దాడులలో 199 మంది ఆరోగ్య కార్యకర్తలు మరణించగా, 628 మంది గాయపడడం అత్యంత జరిగింది. ప్రపంచవ్యాప్తంగా 2019లో వివిధ సందర్భాలలో మానవతామూర్తులు 28.9 మిలియన్ల పిల్లలకు మీసిల్స్ టీకాలు ఇవ్వడం, 6.9 మిలియన్ల శిశువులకు పోషకాహారం అందించడం, 32.2 మిలియన్ల జనులకు సురక్షిత తాగు నీరు ఇవ్వడం, 92.6 మిలియన్ల మానసిక రుగ్మతలు గల పిల్లలకు చేయూతనివ్వడం, 42 మిలియన్ల పెంపుడు జంతువులకు టీకాలు మరియు చికిత్సలు అందించడం మానవాళి ముందు మానవత్వానికి ఆదర్శంగా నిలుస్తున్నది. ప్రతియేటా ప్రపంచవ్యాప్తంగా 211 మిలియన్ల ప్రజలు ప్రకృతి వైపరీత్యాల బారిన పడుతూ, మానవతామూర్తుల వైపు జాలిగా చూస్తున్నారు. మానవత్వం ప్రదర్శించటానికి ముహూర్తాలు ఉండవు. మన ముందు జరిగే ప్రతి అన్యాయం, అవాంఛనీయ ఘటనను ప్రతిఘటించుటకు మానవత్వం చూపాలి.

ప్రస్తుత కోవిడ్-19 సంక్షోభంలో మన ముందు ఎందరో మానవతామూర్తులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి లక్షల మంది ప్రాణాలను కాపాడుతూ ఉన్నారు. ఆసుపత్రులలో వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, పోలీసు యంత్రాంగం, పారిశుద్ధ్య సేవకులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగం, మునిసిపల్ సిబ్బంది అందిస్తున్న ఆదరణ మరియు మానవత్వం వెలకట్టలేనిది. చివరికి కరోనా సోకి మరణించిన అభాగ్య శవాలకు సైతం అంతిమ సంస్కారాలు చేస్తూ, తమ సంస్కారాన్ని మరియు మానవత్వాన్ని చూపుతున్న మహనీయులకు శతకోటి వందనాలు. లాక్‌డౌన్‌లో వలస కార్మికులకు సహాయపడిన నిస్వార్థ సమాజ సేవకుల మానవత్వం వెలకట్టలేనిది. మనిషిని దేవుడిలా మార్చగల ఏకైక మార్గం మానవత్వమేయని గుర్తించుకోవాలి. మనుషుల్లో దైవత్వాన్ని నింపేది మానవత్వ సుగుణమే. ఆకలిలో అలమటించే వారికి బుక్కెడ బువ్వ, ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం, ప్రమాదంలో చేయూత, చీకటి జీవితాలలో వెలుగు నింపడం, అనాధలకు ఆసరా ఇవ్వగల ప్రతి మనిషిలో దేవుడు తిష్ట వేసి ఉంటాడు. ఒక్కరి బాధను చెరిపినా మానవత్వాన్ని చాటినట్లేయని మరువరాదు. మానవత్వం పరిమళించిన వేళ రాక్షసత్వం కాలి బూడిదై, లోక కళ్యాణ కారణం అవుతుందనడంలో సందేహం లేదు. మానవత్వం లేని సమాజంలో రాక్షస రాజ్యమే. జీవన ప్రమాణాలు పెరగడమంటే మానవత్వం విరబూయడమే. ప్రపంచ సమస్యలన్నింటికి సమాధానం మానవత్వ దివ్య ఔషధమే అని మానవాళి నమ్మాలి. మదిన మానవత్వ పరిమళాలు నింపుకొని, పరులకు పంచుట మన అలవాటు కావాలి.

\- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## సంగీత సామ్రాట్టు పండిట్ జస్రాజ్

హైదరాబాద్,ఆగస్టు18(ఆర్ఎన్ఎ): భారతీయ సంగీతానికి మూల స్తంభం లాంటి విద్వాంసుల్లో పండిట్ జస్రాజ్ ఒకరు. సంగీత ప్రపంచంలో ఆయన అందనత్త ఎత్తుకు ఎదిగిన మహానుభావుడు. జస్రాజ్ సంగీతమంటే చెవి కోసుకోని వారు ఉండరు. మెవాతి ఘరానాకు చెందిన ఆయన ఎనిమిది దశాబ్దాలపాటు సంగీతానికి ఎనలేని సేవ చేశారు. 1930 జనవరి 28న జస్రాజ్ హర్యానాలోని హిస్సార్‌లో జన్మించారు. తొమ్మిదో ఏటనే హైదరాబాద్ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ కొలువులో సంగీత విద్వాంసుడిగా నియమితులయ్యారు. ఆయన యవ్వనం మొత్తం హైదరాబాద్‌లోనే గడిచింది. ఆయన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ పురస్కారాలతో సత్కరించింది. గతేడాది ఓ చిన్న గ్రహానికి జస్రాజ్ పేరు పెట్టారు. ప్రపంచంలో ఈ గౌరవం పొందిన ఇద్దరుముగ్గురు సంగీత విద్వాంసుల్లో జస్రాజ్ ఒకరు. పండిట్ జస్రాజ్‌కు హైదరాబాద్‌తో ప్రత్యేక అనుబంధం ఉన్నది. ఆయన తండ్రి మోతీరాం.. నిజాం సంస్థానంలో ఆస్థాన సంగీత విద్వాంసుడిగా సేవలందించారు. వారి కుటుంబం జాంబాగ్‌లో నివాసం ఉండేది. జస్రాజ్ ప్రాథమిక విద్యను వివేకవర్ధిని పాఠశాలలోనే పూర్తిచేశారు. మోతీరాం సమాధి అంబర్‌పేట స్మశానవా టికలో ఉన్నది. తండ్రి, సోదరుడి జ్ఞాపకార్థం ఆయన ఏటా తండ్రి సమాధి వద్ద సంగీత్ సమారోహ్ పేరుతో కచేరీ జరిపేవారు. హైదరాబాద్‌కు ఎప్పుడు వచ్చినా చిన్నతనంలో తిరుగాడిన ప్రదేశాలకు వెళ్లి జ్ఞాపకాలు నెమరేసుకొనేవారు. ప్రపంచ ప్రఖ్యాత భారతీయ సంగీత విద్వాంసుడు పండిట్ జస్రాజ్ (90) మరణించడంతో ఓ మహా సంగీత వృక్షం నేలకు ఒరిగినట్లు అయ్యింది. అమెరికాలోని న్యూజెర్సీలో సోమవారం ఉదయం గుండెపోటుతో తమ తండ్రి తుదిశ్వాస విడిచినట్లు జస్రాజ్ కుమార్తె దుర్గా జస్రాజ్ తెలిపారు.

# హన్మకొండలో దేశంలోనే అత్యధిక వర్షపాతం

## వాగులు వంకలు పొంగడంతో తీవ్రనష్టం

హైదరాబాద్,ఆగస్టు18(ఆర్ఎన్ఎ): దేశంలోనే అత్యధిక వర్షపాతం నమోదైన పది నగరాల్లో హన్మకొండ మొదటి స్థానంలో నిలిచిందని కేంద్ర వాతావరణ శాఖ వెల్లడించింది. హన్మకొండలో 212 మి.మీ. వర్షపాతం నమోదు కాగా దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో మహారాష్ట్రలోని మహబ లేశ్వరంలో 155 మి.మీ., మూడో స్థానంలో మధ్యప్రదేశ్‌లోని ఉమరిలో 153 మి.మీ. వర్షపాతం నమోదైంది. కాగా, వర్షం భారీగా కాకుండా ఐదు రోజుల పాటు ఓ మోస్తరు, ముసురు రూపంలో కురవడంతో ప్రస్తుత పరిస్థితులు నెలకొన్నాయని, అలా కాకుండా భారీ వర్షం కురిస్తే జలప్రళయం ఏర్పడదనే అభిప్రా యాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా భారీ వర్షం కారణంగా నగరం తడిసి ముద్దయ్యింది. నీట మునిగిపోయింది. ములుగు మండలం బండారుపల్లి గ్రామము వద్ద రాళ్లవాగులో ఆర్టీసీ బస్సు, అందులోని ప్రయాణికులు చిక్కుకోగా..పోలీసులు వారిని కాపాడి సురక్షిత ప్రాంతానికి తరలించారు. భూపాలపల్లి నియోజకవర్గం మోరంచ వాగులో బీహార్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికులు చిక్కుకున్నారు. రెస్క్యూ టీంను రంగంలోకి దించగా ఒడ్డుకు చేర్చారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మహిళ పురిటి నొప్పులతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న పోలీసులు ఆపన్న హస్తం అందించారు.

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం మోదుగుగడ్డ తండాకు చెందిన ముగ్గురు రైతులు వ్యవసాయ పనులు నిమిత్తం ఆకెరువాగు దాటుతుండగా వరద ఉధృతికి కొట్టుకుపోయి చెట్టుని పట్టుకొని సహాయం కోసం ఎదురు చూశారు. తండావాసులు వారిని ఒడ్డున చేర్చారు. వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో తెలంగాణ వ్యాప్తంగా వాగులు, వంకలూ, గోదావరి నది పొంగి పొర్లుతున్నాయి. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ములుగు జిల్లా వాజేడు మండలంలోని పూసూరు వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. కృష్ణాపురం వద్ద 163వ జాతీయ రహదారిపై చేరిన వరద నీరు చేరింది. చత్తీస్‌గఢ్ తెలంగాణ రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచాయి. పేరూరు వద్ద వరద నీటి మట్టం 15 మీటర్లకు చేడంతో అధికారులు 3వ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. భారీ వర్షాలు వరదలతో ములుగు జిల్లా ఏటూరు నాగారం మంగపేట మద్యలో ఉన్న జీడి వాగు ఉప్పొంగుతోంది.

# ఉమ్మడి జిల్లాలో కరువుతీరా వానలు

## పరవళ్లు తొక్కుతున్న వాగులు వంకలు
## కనువిందు చేస్తున్న జలపాతాలు
## పలు ప్రాంతాల్లో నీట మునిగిన పంటలు

ఆదిలాబాద్,ఆగస్టు18(ఆర్ఎన్ఎ): ఉమ్మడి జిల్లాలో కరువుతీరా వానలు వద్దాయి. వాగులు వ్కలు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు నిండాయి. ఎడతెరిపి లేకుండా పద్ద వర్షాలతో కుంటాల, పొచ్చెర, కనకాయి, కొరిటికల్, గాయత్రి జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నాయి. జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి. జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జిల్లాలోని ప్రధాన రిజర్వాయర్లు, ప్రాజెక్టులు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఎస్సారెస్పీతోపాటు కడెం, స్వర్ణ, గడ్డెన్నవాగు, సదర్మాట్ ఆనకట్టలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద వచ్చి చేరుతున్నది. ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటి మట్టం 1091అడుగులు (90.313 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 1079.2 అడుగుల(49.448 టీఎంసీలు) వరకు నీరు వచ్చి చేరింది.సదర్మాట్ ఆనకట్ట ప్రస్తుత నీటి మట్టం 9 అడుగులు కాగా.. అడ్డుగోడపై నుంచి 18,357 క్యూసెక్కుల నీరు గోదావరిలో కలుస్తున్నది. జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తుండడంతో జనజీవనం స్తంభించింది. పంట పొలాల్లో నీరు నిలిచి ఉండగా.. పట్టణాలు, పల్లెల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న వాగులు, చెరువుల వద్ద పెట్రోలింగ్ నిర్వహించాలని, ప్రమాద హెచ్చరికలు, గుర్తులు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. అన్ని ప్రాంతాల్లో సందర్శించి.. లోతట్టు ప్రాంతాలు, ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని.. గ్రామాల్లో దప్పు వేయించాలన్నారు. పొచ్చెర, ఇచ్చోడ మండలం గాయత్రి జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నావాగులు పొంగి ప్రవహించడం, చెరువులు మత్తళ్లు దుంకుతుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. వీరికి పోలీసులు సహాయ, సహకారాలు అందిస్తున్నారు. భారీ వర్షాల కారణంగా ఆయా మండలాల్లో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు ఎప్పటికప్పుడు సమీక్షించి చర్యలు తీసుకున్నారు. మరోవైపు పత్తి, సోయా, కంది పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టులకు జలకళ రావడంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు మూడు నెలల తర్వాత భారీ వర్షాలు కురుస్తుండడంతో రైతు ల్లో హర్షం వ్యక్తమవుతున్నది. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లాల అధికారులు అన్నారు. రైతులు వాగులు దాటి పొలాలకు వెళ్లవద్దని, జాలర్లు చేపల వేటకు పోవద్దన్నారు. వర్షాల వల్ల ఏమైనా ఇబ్బందులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు, వాగు, చెరువు నీటిమట్టం వివరాలు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించింది. మిషన్ భగీరథ పైపులకోసం తవ్విన గుంతల్లో రోడ్లపై నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అనేక గ్రామాల్లోని పంట చేలల్లో వరద నీరు నిలిచింది.

# మాజీ ఎంపీ కవిత చొరవతో స్వస్థలాలకు చేరుకున్న గల్ఫ్ బాధితులు



దుబాయ్‌లో చిక్కుకుని మాజీ ఎంపి కవిత చొరవతో నిజామాబాద్ చేరుకున్న గల్ఫ్ కార్మికులు

నిజామాబాద్,ఆగస్టు18(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో చిక్కుకున్న తెలంగాణకు చెందిన గల్ఫ్ కార్మికులు ఎట్టకేలకు నిజామాబాద్ చేరుకున్నారు. గత కొంతకాలంగా గల్ఫ్‌లో చిక్కుకున్న వీరు

నిజామాబాద్ మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత చొరవతో స్వస్థలాలకు చేరుకున్నారు. దుబాయ్ నుంచి వచ్చి విజయవాడలో హోం క్వారంటైన్‌లో ఉన్న జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల వ్యక్తులు కవిత చొరవతో ప్రత్యేక బస్సులో నిజామాబాద్ చేరారు. కష్టకాలంలో అండగా నిలిచిన మాజీ ఎంపీ కవితకు వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. వీరికి నిజామాబాద్ జాగృతి అధ్యక్షుడు అవంతి, నరాల సుధాకర్, ఇతర నాయకులు స్వాగతం పలికారు. తమను సొంతూళ్లకు చేర్చడంలో వీరు ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

## 48మంది ఖైదీలకు కరోనా

లక్నో,ఆగస్టు18(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో కరోనా వైరస్ మరింతగా వ్యాప్తి చెందుతోంది. జిల్లాలో కొత్తగా మరో 75 మందికి కరోనా సోకినట్లు గుర్తించారు. జిల్లా జైలులోని 48 మంది ఖైదీలకు కరోనా సోకింది. దీంతో జైలులో కలకలం చెలరేగింది. ఈ నేపథ్యంలో ఖైదీలందరినీ ఇతర జైళ్లకు తరలించారు. ఖైదీలకు కరోనా సోకిన నేపథ్యంలో జిల్లా జైలును శానిటైజ్ చేశారు. అలాగే ఇతర ఖైదీలు, సిబ్బందికి థర్మల్ స్క్రీనింగ్ కూడా చేశారు. జైలు డీజీపీ ఆదేశాల మేరకు బులంద్‌షహర్ జిల్లా జైలు సూపరింటెండెంట్ ఓపీ కతిహార్ జైలులోని ఖైదీలందరికీ కరోనా పరీక్షలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో 40 మంది ఖైదీలకు కరోనా సోకినట్లు తేలింది. జిల్లాలో కరోనా కారణంగా 39 మంది మృతిచెందారు. బులంద్‌షహర్‌లో ఇప్పటివరకు 1,448 మందికి కరోనా వైరస్ సోకింది.

# భారీ వర్షాలతో గిరిజన గ్రామాల్లో చిత్తడి

## పొంగి ప్రవహిస్తున్న వాగులు వంకలు

భద్రాచలం,ఆగస్టు18(ఆర్ఎన్ఎ): విస్తారంగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు, చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. ఈ క్రమంలో అధికారులు పాల్వంచ కిన్నెరసాని డ్యామ్ గేట్లను ఎత్తడంతో నీరు దిగువకు ప్రవహిస్తోంది. దీంతో కొందరు యువకులు రాజాపురం ఉల్వనూరు మధ్యలో ఉన్న లో లెవెల్ వంతెన వద్ద నీటి ప్రవాహంలో దోమల తెరల ద్వారా చేపల వేట సాగిస్తున్నారు. గతంలో గేట్లు తెరిచిన కొన్ని సందర్భాలలో కిన్నెరసాని డ్యామ్‌లో ఉన్న మొసళ్లు నీటి ప్రవాహానికి బయటకు కొట్టుకొచ్చిన సంఘటనలు ఉన్నాయి. ప్రమాదకరమైన ప్రాంతం అయినప్పటికీ ఎటువంటి హెచ్చరికలు బోర్డులు లేకపోవడంతో ఇలా కొందరు యువకులు చేపల వేట సాగించారు. గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జోరు వర్షాలు ఏజెన్సీ గ్రామాలను అతలాకుతలం చేస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు అలుగులు పోస్తున్నాయి. పలు ఇళ్లు, గుడిసెలు, ఇంటి గోడలు కూలిపోయాయి. గ్రామాల్లో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు రక్షణ చర్యలు చేపడుతున్నారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టారు. భద్రాచలం వద్ద గోదావరి 60 అడుగులు చేరింది. చర్ల మండలం తాలిపేరు ప్రాజెక్టు 25 గేట్లు ఎత్తి 1,47,525 క్యూసెక్కుల నీటిని వదిలారు. దుమ్ముగూడెం హెడ్‌లాకుల వద్ద 32.4 అడుగులకు గోదావరి ప్రవాహం చేరుకుంది. భద్రాచలం నియోజకవర్గంలోని భద్రాచలం, దుమ్ముగూడెం, పర్ణశాల, చర్ల మండలాల్లో, పినపాక ని యోజకవర్గంలోని మణుగూరు, అశ్వాపురం, బూర్గంపహాడ్, సారపాక, పినపాక, కరకగూడెం, ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో వర్షం కురిసింది. గోదావరి పరివాహక ప్రాంతాల్లో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, జిల్లా అడిషనల్ కలెక్టర్ అనుదీప్, మణుగూరు ఏఎస్పీ డాక్టర్ శభరీశ్ పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు.

## మొక్కలు నాటిన ఎంపి రాములు

హైదరాబాద్,ఆగస్టు18(ఆర్ఎన్ఎ): రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమం ఉద్యమంలా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, సినీ ప్రముఖులు, క్రీడాకారులు, మేధావులు పాల్గొని మొక్కలను నాటుతున్నారు. నాగర్‌కర్నూల్ టీఆర్ఎస్ ఎంపీ రాములు తన జన్మదినాన్ని పురస్కరించుకుని గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో పాల్గొన్నారు. తన కుమారుడు, మనవళ్లతో కలిసి రాములు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ ఎంపీ రాములుకు ధన్యవాదాలు తెలిపారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు సంతోష్ కుమార్. ఎంపీ రాములుకు సంతోష్ కుమార్ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు.

# సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై మరింత అధ్యయనం

## సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాలి
## ఐఐటిలకు ఉపరాష్ట్రపతి వెంకయ్య సూచన

న్యూఢిల్లీ,ఆగస్టు17(ఆర్ఎన్ఎ): సమాజం, మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం, మరింత లోతైన పరిశోధనలు జరపడం ద్వారా ఆయా సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాలని ఐఐటీలు సహా ఉన్నతవిద్యాసంస్థలకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులు, ఆరోగ్య సమస్యలు తదితర అంశాలను మొదటి ప్రాధాన్యతగా గుర్తించాలని సూచించారు.

ఢిల్లీ ఐఐటీ వజ్రోత్సవాలను ఆన్‌లైన్ వేదిక ద్వారా ప్రారంభించిన ఉపరాష్ట్రపతి.. గతేడాది ప్రకటించిన ప్రపంచ అత్యుత్తమ విద్యాసంస్థల్లో కేవలం 8 భారతీయ సంస్థలే ఉన్నాయన్న విషయాన్ని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన నూతన విద్యావిధానం-2020 ద్వారా మళ్లీ భారత్ విశ్వగురువుగా, ప్రపంచ విద్యాకేంద్రంగా రూపుదిద్దుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, విద్యావేత్తలు, ప్రైవేటు రంగం కలిసి విద్యారంగంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పి, అత్యుత్తమ విధానం దిశగా చొరవ తీసుకోవాలని, ఇది అందరి సంయుక్త ప్రయత్నం ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. యువతకు సరైన నైపుణ్యాన్ని అందించగలిగితే భారత్.. ప్రపంచ యవనికపై పుష్కలమైన అవకాశాలు అందిపుచ్చుకుని ప్రపంచానికి ఆదర్శంగా నిలిచే దిశగా ముందుకు సాగడం ఖాయమని తెలిపారు. ఇందుకోసం విద్యాప్రమాణాలను పెంచుకోవాల్సిన అవసరమున్నదన్నారు.దేశానికి, యువశక్తి కీలకమైన వనరు అని.. యువతలో ప్రతిభాపాటవాలకు కొదవలేదని.. వీరికి సరైన నైపుణ్యాన్ని అందించగలిగితే భారత్.. ప్రపంచ యవనికపై పుష్కలమైన అవకాశాలు అందిపుచ్చుకుని ప్రపంచానికి ఆదర్శంగా నిలిచే దిశగా ముందుకు సాగడం ఖాయమని తెలిపారు. ఇందుకోసం విద్యాప్రమాణాలను పెంచుకోవాల్సిన అవసరముందని, నూతన విద్యావిధానం ద్వారా ఈ రంగంలోని సమస్యలను పరిష్కరించుకుని మరింత వృద్ధి సాధించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐఐటీ న్యూఢిల్లీ డైమండ్ జూబ్లీ లోగో, 2030 స్ట్రాటజీ డాక్యుమెంట్ ను ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ రమేశ్ పోఖ్రియాల్ నిశాంక్, ఐఐటీ ఢిల్లీ డైరక్టర్ ప్రొఫెసర్ వీ రామ్ గోపాల్ రావ్, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

# ధోనీ రిటైర్మెంట్ ముందే తెలుసు

## -మనస్ఫూర్తిగా తాము కౌగిలించుకున్నాం: రైనా

న్యూఢిల్లీ,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): తన చిరకాల మిత్రుడు, టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని రిటైర్మెంట్ ప్రకటించనున్న విషయం తనకు ముందే తెలుసని టీమిండియా మాజీ బ్యాట్స్‌మెన్ సురేశ్ రైనా వెల్లడించాడు. రైనా, ధోని, పియూష్ చావ్లా, దీపక్ చాహర్, కర్ణ్ శర్మ ఆగస్టు 14న చెన్నై వెళ్లారు. మరుసటి రోజు ఆగస్టు 15న ధోని తన రిటైర్మెంట్ వార్తను సోషల్ మీడియాలో పోస్టు చేయగా, వెంటనే సురేశ్ రైనా రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రైనా మాట్లాడుతూ పదవీ విరమణ ప్రకటించిన తరువాత తామిద్దరం మనస్ఫూర్తిగా కౌలిగించుకున్నామన్నాడు. తాను, పియూష్, అంబటి రాయుడు, కేదార్ జాదవ్, కర్ణ్ అందరం కూర్చొని కెరీర్ల గురించి మాట్లాడుకున్నామని, ఆరోజు రాత్రి ఆనందంగా గడిపామని రైనా చెప్పుకొచ్చాడు. అయితే శనివారం ఆగస్టు 15న రిటైర్మెంట్ ప్రకటించాలని తాము ముందే నిర్ణయించుకున్నట్లు రైనా తెలిపాడు. ధోని జెర్సీ నెంబర్ 7, తనది 3 రెండు పక్కపక్కన పెడితే 73 అవుతుందని, ఆగస్టు 15న భారతదేశం స్వాతంత్ర్యం పొంది 73 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తమకు రిటైర్మెంట్ ప్రకటించడానికి ఇదే మంచి రోజని భావించినట్లు తెలిపాడు.

ఇదిలా ఉండగా ధోని తన కెరీర్‌ను 23 డిసెంబర్ 2004లో ప్రారంభించగా, రైనా 30 జూలై 2005లో ప్రారంభించాడు. ఇద్దరూ అంతర్జాతీయ క్రికెట్‌ను దాదాపుగా కలిసి ప్రారంభించారు. ఐపీఎల్‌లో ఇద్దరు సీఎస్‌కే తరపున ప్రారంభం నుంచి ఆడుతున్నారు.

# మైదానంలో ప్రకటన చేసి ఉంటే బాగుండేది

## -ధోనీ రిటైర్మెంట్‌పై ఇంజమామ్ ఉల్ హక్ స్పందన

ఇస్లామాబాద్,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ కావాలని మహేంద్ర సింగ్ ధోని తీసుకున్న నిర్ణయంతో పాకిస్తాన్ మాజీ కెప్టెన్ ఇంజామామ్ ఉల్ హక్ కూడా నిరాశ చెందాడు. ధోని వంటి ఆటగాడు ఇంటి నుండి కాకుండా మైదానం నుంచి రిటైర్మెంట్ ప్రకటిస్తే బాగుండేదని ఆయన భావిస్తున్నారు. ఇంజామామ్ తన యూట్యూబ్ ఛానెల్‌లో పోస్ట్ చేసిన వీడియోలో ఈ విషయాలు చెప్పారు. సచిన్ టెండూల్కర్‌కు కూడా ఇదే మాదిరి సలహా ఇచ్చానని, మీకు ఇంత పెద్ద ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్నప్పుడు.. మీరు మీ క్రికెట్ ప్రయాణాన్ని మైదానం నుంచి ముగిస్తే అందరూ సంతోషిస్తారని ఇంజమామ్ చెప్పారు. మైదానం నుంచే మీరు గౌరవం, స్టార్డమ్ సాధించినందున గ్రౌండ్ లోనే వీడ్కోలు పలికితే సబబుగా ఉంటుందని సచిన్ కు చెప్పానన్నారు. ధోని కూడా అదే చేసి ఉంటే బాగుండేదని, ఇది వారి అభిమానులకు, మాలాంటి క్రికెటర్లకు కూడా చాలా సంతోషంగా ఉంటుందని తెలిపారు. పాకిస్తాన్ మాజీ కెప్టెన్ ధోనిని భారత క్రికెట్ ఉత్తమ కెప్టెన్ అని ప్రశంసించారు. అతను యువ ఆటగాళ్లకు స్ఫూర్తిదాయకమయ్యాన్నారు. అతడి కెప్టెన్సీలోనే మ్యాచ్ విజేతలైన అశ్విన్, సురేష్ రైనా టీమ్ ఇండియాకు చేరుకున్నారని తెలిపారు. ఎంఎస్ ధోనికి ఆట పట్ల ఎంతో అవగాహన ఉన్నదని, యువ ఆటగాళ్లను పెద్ద ఆటగాళ్లుగా మార్చడంలో ఆయన ఎంతో ప్రవీణుడు అని చెప్పారు. మ్యాచ్ ఎలా ముగించాలో తెలిసిన ఆటగాడు ధోని అని, అతను ప్రతి మ్యాచ్‌లో సెంచరీ చేయలేదు, కానీ అతను ఈ విధంగా ఇన్నింగ్స్ చేసి తద్వారా జట్టును గెలిపించేవాడని పేర్కొన్నారు.

# సంకీర్త్‌ను అభినందించిన సింగరేణి సిఎండి

మంచిర్యాల,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): సింగరేణి కార్మికుడైన సిరిశెట్టి సత్యనారాయణ కుమారుడు సంకీర్త్ సివిల్స్ లో 330 ర్యాంకు సాధించడం హర్షించదగిన విషయమని సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ అన్నారు. హైదరాబాద్ లోని సింగరేణి భవన్ లో సోమవారం సంకీర్త్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంకీర్త్ మాదిరిగానే ఇతర సింగరేణి కార్మికుల పిల్లలు మంచి పట్టుదల, లక్ష్యంతో కృషిచేస్తూ ఉన్నతస్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు.బెల్లంపల్లి ఏరియా ఎక్స్‌ప÷-లోరేషన్ విభాగంలో ఎలక్ట్రీషియన్ గా పనిచేస్తున్న సంకీర్త్ తండ్రి సిరిశెట్టి సత్యనారాయణ, తల్లి అనిత లను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. నేడు తమ పిల్లల చదువుల పట్ల సింగరేణి కార్మికుల దృకృథం మారిందని, ఎక్కువ మంది ఉద్యోగులు తమ పిల్లల్ని ఉన్నత చదువుల వైపు ప్రోత్సహించడం శుభ పరిణామమని తెలిపారు.

# వరదప్రాంతాల్లో పర్యటించిన బండి సంజయ్

వరంగల్,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): వరంగల్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పర్యటించి వరద ప్రాంతాలను పరిశీలించారు. బిజెపి స్థానిక నేతలతో కలసి ఆయన పర్యటించారు. హన్మకొండ-వరంగల్‌లో పలుకాలనీలు నీటమునిగాయి. నీటమునిగిన పలుకాలనీలను బండి సంజయ్ పరిశీలించారు. వరంగల్ నగరంలో ముంపు ప్రాంతాల ప్రజలు ఇంకా బిక్కు బిక్కుమంటూనే గడుపుతున్నారు. వరదనీటిలో చిక్కుకు పోయిన ప్రజలను సురక్షిత ప్రాంతాలకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు తరలిస్తున్నాయి. వరద సహాయక చర్యల్లో భాగంగా పడవలను ఉపయోగించడం నగర చరిత్రలో ఇదే మొదటి సారి. హంటర్ రోడ్డు, సాయినగర్ కాలనీ, సంతోషిమాత, కాలనీ, సరస్వతి నగర్, ములుగు రోడ్డు, హంటర్ రోడ్డు, అండర్ రైల్వే గేట్, దీనదయాల్ పేట, నజరత్ పురం, వడెపల్లి, కేయూ 100 ఫీట్ల రోడ్డు ప్రాంతాలు వరద తాకిడికి తీవ్రంగా గురయ్యాయి.

# ఇంద్రకీలాద్రిపై కరోనా కలకలం

## -దుర్గగుడి సిబ్బందికి కరోనా

విజయవాడ,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ):ఏపీలో కరోనా విజృంభణ కొనసాగుతోంది. రోజురోజుకు కేసుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు తీసుకున్నప్పటికీ కరోనా విజృంభణ తగ్గుముఖం పట్టడంలేదు. రాష్ట్రంలోని ఆలయాల్లో సైతం కరోనా కలకలం సృష్టిస్తోంది. ఇప్పటికే తిరుమల శ్రీవారి ఆలయంలోని పలువురు అర్చకులు, సిబ్బందికి కరోనా రావడం కలకలం రేపుతుండగా... తాజాగా విజయవాడ దుర్గగుడి ఆలయంలోని సిబ్బంది, ఉన్నతాధికారులకు కరోనా పాజిటివ్ రావడం కలకలం రేపింది. దుర్గగుడి ఈవోకి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. ఆలయంలో మరో 18 మంది కరోనా బారిన పడ్డారు. ఆలయంలో విధులు నిర్వహిస్తున్న అర్చకుడు రామకృష్ణ ఘనపాటి కరోనా కారణంగా చనిపోయారు. మూడు రోజుల క్రితం ఆయనకు కరోనా సోకినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆయన భార్య కూడా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. అయితే టెస్ట్ చేయించుకునేందుకు కరోనా భయపడటం లేదు దాంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఆలయంలో రోజూ శానిటైజ్ చేసినా, మాస్కులు ధరించినా కొత్త కేసులు రావడం ఆందోళన కలిగిస్తోందని సిబ్బంది వాపోతున్నారు.శ్రావణ మాసం సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. దీంతో కరోనా నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని ఆలయ కమిటీ నిర్ణయించింది.

# ఏపిలో నేతల ఫోన్లు ట్యాపింగ్

## న్యాయవ్యవస్థను కూడా లక్ష్యంగా చేసుకున్నారు

## ప్రధాని మోడీకి లేఖ రాసిన చంద్రబాబు

అమరావతి,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): ఏపీలో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం ఫోన్లు ట్యాపింగ్‌కు పాల్పడుతుందని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆరోపించారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలంటూ ప్రధాని నరేంద్రమోదీకి సోమవారం లేఖ రాశారు. ప్రతిపక్ష పార్టీలు, న్యాయవాదులు, మీడియా వ్యక్తులు, సామాజిక కార్యకర్తల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి మూడో స్తంభంగా ఉన్న న్యాయవ్యవస్థ ఫోన్లను ట్యాప్ చేసుకుంటున్నట్లు కనిపిస్తోందని టీడీపీ అధ్యక్షుడు ఆ లేఖలో ఆరోపించారు. కేంద్ర సమాచార, సాంకేతిక శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌కు కూడా లేఖను పంపారు. అత్యాధునిక టెక్నాలజీని వినియోగించి కొందరు ప్రైవేటు వ్యక్తులతో అక్రమంగా ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నారని, దాన్ని అరికట్టకపోతే 'దేశ సమగ్రతకు, భద్రతకు పెనుముప్పుగా మారుతుందని' లేఖలో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలు భీతి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన నుంచి రాష్ట్రంలో ప్రజాస్వామ్య సంస్థలపై ఒక పద్ధతి ప్రకారం.. సంఘటితంగా దాడులు జరుగుతున్నాయన్నారు. 'రాష్ట్ర ఎన్నికల కమిషన్, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) వంటి సంస్థలపై, ప్రతిపక్ష పార్టీల నాయకులు, న్యాయవాదులు, మీడియా వ్యక్తులు, సామాజిక కార్యకర్తలు వివిధ రకాల వంచకు గురిచేస్తూ వైఎస్సార్ సీపీ దాడులు, బెదిరింపులకు పాల్పడుతుందని ఆయన ఆరోపించారు. వివిధ రంగాలకు చెందిన వ్యక్తుల ఫోన్లను ట్యాపింగ్ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చట్టాన్ని పాటించలేదన్నారు. అధికార పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారాన్ని నిలబెట్టుకోవడంలో అత్యుత్సాహంతో, ప్రభుత్వ వనితీరు లోపానికి వ్యతిరేకంగా తమ గళాన్ని వినిపిస్తే ఏ వ్యక్తినైనా, సంస్థనైనా ముప్పుతిప్పలు పెట్టి, దాడి చేస్తోంది' అని ఆయన అన్నారు.

# హైదరాబాద్-లండన్ మధ్య విమానాల పునరుద్ధరణ

## శంషాబాద్ నుంచి బయలుదేరిన బ్రిటిష్ ఎయిర్‌వేస్ బోయింగ్

హైదరాబాద్,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): భారత, యూకేప్రభుత్వాల మధ్య కుదిరిన 'ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ బబుల్' ఒప్పందం ప్రకారం హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్ హీత్రో విమానాశ్రయానికి తిరిగి విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి.

కోవిడ్-19 మహమ్మారి నేపథ్యంలో కోలుకుంటున్న పౌర విమాన రంగానికి ఈ చర్య ఊతం ఇస్తుంది. హైదరాబాద్, లండన్ మధ్య తిరిగి సర్వీసులను ప్రారంభిస్తూ హైదరాబాద్ విమానాశ్రయం నుంచి లండన్‌లోని హీత్రో విమానాశ్రయానికి సోమవారం ఉదయం సుమారు 7.50 గంటలకు బ్రిటిష్ ఎయిర్‌వేస్‌కు చెందిన బోయింగ్ 787-9 డ్రీమ్‌లైనర్ విమానాశ్రయం బయలుదేరి వెళ్లింది. ఈ విమానం ద్వారా వెళ్లిన ప్రయాణికులంతా పూర్తిగా శానిటైజ్ చేసిన జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంకు చెందిన అంతర్జాతీయ డిపార్చర్ టెర్మినల్ గుండా తరలివెళ్లారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఇప్పటికే పలు జాగ్రత్తల మధ్య అంతర్జాతీయ విమానాల రాకపోకలు జరుగుతున్నాయి. టెర్మినల్‌లోనికి ప్రవేశించడానికి ముందే ప్రయాణికులందరికీ తప్పనిసరిగా నిర్వహించే థర్మల్ స్క్రీనింగ్, సామాజిక దూరం నిబంధనలు సహా అన్ని భద్రతాపరమైన చర్యలనూ తీసుకోవడం జరిగింది. యూకేకు చెందిన బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమాన సర్వీసులు నేటి నుంచి ప్రతి వారం నాలుగు సర్వీసులను నిర్వహిస్తుంది. ఇవి ప్రతి సోమ, బుధ, శుక్ర, ఆదివారాలలో ఉంటాయి. భారత ప్రభుత్వ హోమ్ వ్యవహారాల శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏ ప్రయాణికుడైనా హైదరాబాద్ నుంచి లండన్‌కు టికెట్‌ను బుక్ చేసుకోవచ్చు. ప్రయాణికులందరూ కోవిడ్-19 మార్గదర్శకాలకు లోబడి ఉండాల్సి ఉంటుంది. దీనిపై విమానాశ్రయ ప్రతినిధి మీడియాతో మాట్లాడుతూ.. అంతర్జాతీయ 'ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ బబుల్స్' ఒప్పందం కింద ఒక ముఖ్య గమ్యస్థానానికి విమాన సర్వీసులను పునఃప్రారంభించడం చాలా సంతోషకరమన్నారు. యూకే మాకెప్పుడూ ఒక ముఖ్య గమ్యస్థానం అని విమాన సర్వీసులు పునఃప్రారంభ మయ్యేలా చేసిన భారత, యూకే ప్రభుత్వాలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్, లండన్‌ల మధ్య తిరిగి సర్వీసులు ప్రారంభం కావడం వల్ల ప్రజలను, సరుకులను ఒక చోటి నుంచి మరోచోటికి తరలించడం జరిగి ఆర్థిక, సామాజిక సంబంధాల పునరుద్ధరణకు అవకాశం ఏర్పడుతుందన్నారు. అంతర్జాతీయంగా లాక్‌డౌన్ పరిస్థితుల తర్వాత హైదరాబాద్, యూకేల మధ్య డైరెక్ట్ ÷÷-లట్ సేవలు పునఃప్రారంభం కావడం మాకెంతో సంతోషంగా ఉంది. భారతదేశంలోని మా కస్టమర్లు తిరిగి తమ స్నేహితులు, కుటుంబసభ్యులతో కలవడానికి వేచి చూస్తున్నారని మాకు తెలుసు. వారందరికీ తిరిగి మా విమానసేవలు అందించడానికి మేం సిద్ధంగా ఉన్నాం' బ్రిటిష్ ఎయిర్‌వేస్ ప్రతినిధి అన్నారు.

కోవిడ్ మహమ్మారి కారణంగా దెబ్బ తిన్న ఆర్థికవ్యవస్థను గాడిలో పెట్టడానికి భారత ప్రభుత్వం అన్‌లాక్ 3.0 సందర్భంగా, వివిధ దేశాలతో 'ట్రాన్స్‌పోర్ట్ బబుల్స్' లేదా 'వాయు రవాణా ఒప్పందాలు' అనే తాత్కాలిక ఏర్పాట్లకు అనుమతించింది. దీని కింద ఏవైనా రెండు దేశాలు కోవిడ్-19 మహమ్మారి కారణంగా రద్దైన రెగ్యులర్ అంతర్జాతీయ సర్వీసులను పునఃప్రారంభించుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో కరోనా వైరస్ నుంచి మనల్ని మనం రక్షించుకోవడానికి అతి తక్కువ ప్రయాణ సమయంతో, అత్యంత జాగ్రత్తల మధ్య జరిగే విమాన ప్రయాణాలే అత్యంత సురక్షితమైనవిగా తేలింది. మే 25న హైదరాబాద్ విమానాశ్రయం నుంచి విమాన సర్వీసులు పునఃప్రారంభమైన నాటి నుంచి జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సురక్షితమైన ప్రయాణం కొరకు డిపార్చర్ ర్యాంప్ నుంచి బోర్డింగ్ గేటు వరకు పూర్తి శానిటైజ్ చేయబడిన కాంటాక్ట్-లెస్ అనుభవాన్ని ప్రయాణికులకు అందిస్తోంది.

# ఫోటన్ గ్యాపింగ్ వ్యవహారం దారుణం

## ట్యాపింగ్‌పై స్పందించి చర్యలు తీసుకోవాలి: ఎంపి రఘురామ

న్యూఢిల్లీ,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): ఫోన్ ట్యాపింగ్ తీరని ద్రోహమని ఎంపి రఘురామకృష్ణం రాజు అన్నారు. తాజాగా ఆయన మరోసారి వైసీపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తనను బెదిరించే వారిని ఓ అదృశ్య శక్తి నడిపిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ప్రభుత్వం తక్షణం స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్క్ హయత్ హోటల్‌లో నిమ్మగడ్డ రమేశ్, కామినేని శ్రీనివాస్, సుజనా చౌదరి సమావేశం అయిన అంశాన్ని ప్రస్తావిస్తూ.. రాజ్యసభ ఎంపీ విజయసాయి రెడ్డి ట్వీట్‌ను గుర్తు చేశారు. దుష్ట చతుష్టయం అంటూ విజయసాయి ట్వీట్ చేశారని, ఫేస్ టైమ్ అంశాన్ని కూడా దానిలో ప్రస్తావించారన్నారు. ఫేస్ టైమ్‌లో మాట్లాడిన నాలుగో బిగ్ బాస్ ఎవరని విజయసాయి ట్వీట్ చేశారన్నారు. హిచ్ కాక్ సస్పెన్స్ సినిమాలా ఇలా పెట్టారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అంటే మొత్తం అన్నీ ట్యాప్ చేసి వింటున్నారని చెప్పకనే చెప్పారా? లేదా భయానికి గురి చేస్తున్నారా? లేక నిజంగానే జరుగుతోందా? ఈ విషయాన్ని విజయసాయి కన్ఫామ్ ఎలా చేశారని ప్రశ్నించారు. ట్యాపింగ్ ద్వారా తెలిసిందన్న అనుమానం సామాన్యుల్లో నెలకొందన్నారు. ఈ అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. న్యాయ వ్యవస్థపై టెలిఫోన్ నిఘా అన్నది రుజువైతే ప్రభుత్వానికి మచ్చ అని, ప్రభుత్వంలో ఏ ఒక్కరు తప్పు చేసిన సీఎంగా దానికి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇలాంటివి జరగకుండా ముందు జాగ్రత్తతో ఉండాలని సూచించారు. 'నాకు టైమ్ ఇస్తే నేనే చెబుతా.. రచ్చబండలో చెబితే బాగుం డదు... ట్యాపింగ్‌తో మీకు సంబంధం లేదన్న విషయం అందరికీ తెలుసు.. కానీ సంబంధిత వ్యక్తులు ఎవరన్నదానిని తేల్చాలి' అని కోరారు.

# గిరిజన వర్సిటీని విస్మరించిన కేంద్రం

## తుంగలో తొక్కిన విభజన చట్టం

## పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

విజయనగరం,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): విజయనగరం జిల్లా కొత్తవలస మండలంలోని రెల్లి రెవిన్యూ గ్రామంలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలను ఏర్పాటు కలగానే మిగిలి పోయింది. ప్రత్యేకహోదా కోసం పోరాడుతూనే ఉంటామని ఇటీవల పంద్రాగస్ట్ వేడుకల్లో ప్రకటించిన సిఎం ఈ సమస్యపై కేంద్రంతో పోరాడాల్సిన అవసరం ఉంది. విభజన సమస్యలపై నిరంతరం పోరాడితే తప్ప అవి సాకారం అయ్యేలా కనిపించడం లేదు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం అనేక విద్యా సంస్థల ఏర్పాటుతో పాటు...ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలను ఏర్పాటు చేయాలి. ఎపిలో యూనివర్సిటీని అరకులో ఏర్పాటు చేయాలని ముందు ప్రతిపాదించారు. తరువాత కొత్తవలస దగ్గర స్థల సేకరణ చేశారు. జగన్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సాలూరులో అన్నారు. ఆరు సంవత్సరాలైనా ఇప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.నాటి తెలుగుదేశం ప్రభుత్వం రూ.ఐదు కోట్లు కేటాయించి 525.08 ఎకరాల భూమిని కొంత ప్రభుత్వ భూమి, మరి కొంత రైతుల నుండి సేకరించి, స్థలం చుట్టూ ప్రహరీ గోడ కూడా నిర్మించింది. ఎట్టకేలకు కేంద్ర మానవ వనరుల శాఖ నవంబర్ 2018లో దీనికి ఆమోద ముద్ర వేసింది. అయితే దీని నిర్మాణం మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. 2019లో ఆంధ్ర యూనివర్సిటీని దీనికి మెంటార్ యూనివర్సిటీగా ప్రకటించి, విజయనగరంలోని ఆంధ్ర యూనివర్సిటీ క్యాంపస్ నుండి కొన్ని తరగతులను మొక్కుబడిగా తాత్కాలిక గెస్టు ఫాకల్టీతో ప్రారంభించారు. గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు రూ.1100 కోట్లు ఖర్చవుతుందని కేంద్ర నిపుణుల బృందం తెలిపింది. అయితే కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ నయాపైసా కేటాయించ లేదు.గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుతో గిరిజనాభివృద్ధికి వీలు కలుగుతుందని అంటున్నారు. మధ్యప్రదేశ్ లోని అమర్ కంటక్‌లో ఉన్న ఒకేఒక్క కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు తరవాత మంచి ఫలితాలు వచ్చాయి. ఈ యూనివర్సిటీ వల్ల అత్యంత వెనుకబడ్డ విద్యార్థులకు, మహిళలకు లాభం చేకూరుతోందని అర్థమవు తోంది. గిరిజన భాషలను, సాంప్రదాయాలను, సంస్కృతిని పరిరక్షించే ప్రత్యేక అధ్యయనాలు ఇక్కడ జరుగుతున్నాయి. గిరిజన భాషా నిఘంటువులు, లిపి లేని గిరిజన భాషలకు ప్రత్యేక లిపిని రూపొందించే కృషి చేస్తున్నారు. విద్యార్థులకు విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడుతున్నాయి. కేవలం విద్యార్థులకే గాక ఆ ప్రాంతం లోని గిరిజనులకు తేనె తయారీ, సోయా బీన్స్ పాలు, ఫ్యాషన్ టెక్నాలజీ వంటి వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడంతో వారికి కూడా ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయి. ఫలితంగా మొత్తం ఆ ప్రాంత అభివృద్ధికి ఈ యూనివర్సిటీ ఏర్పాటు ఉపయోగపడుతోంది. ఇటువంటి గిరిజన వర్సిటీని ఇక్కడ కూడా మరింత మెరుగ్గా ఏర్పాటు చేస్తే...మొత్తం రాష్ట్రంతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి సహాయకారిగా వుంటుంది. రాష్ట్ర విభజన చట్టంలో స్పష్టంగా ఉన్నప్పటికీ...ఆరేళ్లు గడిచినా గిరిజన యూనివర్సిటీల ఏర్పాటుకు ఏ చర్యలూ చేపట్టడం లేదు. మిగిలిన సంస్థలకు సరిపడ నిధులూ కేటాయించడంలేదు. ఏమాత్రం జాప్యం లేకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణం దీని ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ. అజశర్మ డిమాండ్ చేశారు.

# ఏటూరు నాగారంలో ఎంపి కవిత పర్యటన

## వరద బాధితులకు పరామర్శ

## వరదలతో పొంగిపొర్లిన వాగులు వంకలు

ములుగు,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): వరదప్రభావిత ప్రాంతాల్లో మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత పర్యటించారు. వరదలతో తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను తెలుసుకున్నారు.

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో ఎంపీ మాలోతు కవిత పర్యటించారు. గత ఐదు రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండటంతో జిల్లా మొత్తం తడిసి ముద్దయింది. చెరువులు, కుంటలు అలుగు దుంకుతున్నాయి. రోడ్లు తెగిపోయాయి. ఇండ్లు కూలిపోయాయి. కొన్ని చోట్ల పంట పొలాలు నీట మునిగాయి. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలను ఎంపీ కవిత సందర్శించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఎడతెరిపిలేని వర్షాలకు జిల్లా జలమయమైంది. వాగులు, చెరువులు మత్తళ్లు దుంకుతున్నాయి. గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తున్నది. దీంతో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. గ్రామాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని రామప్ప సరస్సు మత్తడి ఉప్పొంగి ప్రవహించడంతో పాలంపేట గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. వెంకటాపూర్ నుంచి పాలంపేటకు వెళ్లే దారిలో లోలెవల్ కాజ్‌వే నుంచి భారీగా వరద నీరు ప్రవహించడంతో ఇబ్బందులు తలెత్తాయి. బండారుపల్లి గ్రామం నుంచి నర్సాపూర్ మీదుగా రామప్పకు వెళ్లే దారిలో సైతం రాళ్లవాగుతో పాటు పలు లోలెవల్ కాజ్‌వేలపై వరద నీరు ప్రవహిస్తుండ టంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.రామప్ప తూర్పు ముఖద్వారం వైపు ఇటీవల నిర్మించిన నూతన రహదారిపై నుంచి మత్తడి ప్రవాహం పెరగడంతో రోడ్డు తెగిపోయింది. మేడివాగు నుంచి భారీగా వరదనీరు చేరడంతో రామప్ప సరస్సు పూర్తి స్థాయి నీటి మట్టానికంటే మరో 3 అడుగుల అధిక నీరు వచ్చి చేరింది. జంగాలపల్లి సమీపంలో జాతీయ రహదారి కింద ఉన్న మేడి వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో మేడివాగు, రామప్ప సరస్సు నీరు ములుగు శివారుకు చేరుకున్నాయి. రామప్ప సరస్సు, మేడివాగు కలిసిపోవడం ఇదే మొదటి సారి అని స్థానికులు చెప్తున్నారు. గోదావరి వరదలతో ముంపునకు గురైన గ్రామాలకు రెవెన్యూ, పోలీసు అధికారులు పడవలపై వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. ప్రజలను ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించి భోజన సౌకర్యాలు ఏర్పాటు చేసారు. ఎడ్జర్లపల్లి-వెంకటాపురం ప్రధాన రహదారిపై పడిన వృక్షాన్ని తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూశారు.



ములుగు జిల్లా ఏటూరునాగారం ప్రాంతంలో వరదల వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను పరామర్శించిన మహబూబాబాద్ ఎంపి మాలోత్ కవిత

# నంది ఎల్లయ్య ఉత్తమ దళిత నేత

## ఆయనకు స్మారక స్థూపం ఏర్పాటు చేయాలి: ఉత్తమ్

హైదరాబాద్,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): తెలంగాణలో రాజకీయాలు పూర్తిగా దిగజారిపోయాయని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. రాజకీయాలు పూర్తిగా వ్యాపారంగా మారిపోయాయని, వ్యాపారంగా మారిన రాజకీయాలను మార్చడానికి అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. నంది ఎల్లయ్య దళిత దిగ్గజమని కొనియాడారు. సిద్దిపేటలో సీఎం కేసీఆర్, నంది ఎల్లయ్య కలసి పనిచేశారని తెలిపారు. నంది ఎల్లయ్య విగ్రహాలు, స్మారకస్థూపాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. నంది ఎల్లయ్యకు కాంగ్రెస్ ఘనంగా నివాళి అర్పించింది. నంది ఎల్లయ్య మరణం ఈ సమాజానికి తీరని లోటు అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఎల్లయ్య కాంగ్రెస్ నాయకులకు ఆదర్శం అని చెప్పారు. ప్రజాదరణ పొందిన నేత మర్రి చెన్నారెడ్డి నుంచి నేటి వరకు అందరు నాయకులతో కలిసి ఆయన పని చేయడం చాలా గొప్ప విషయమన్నారు. 6 సార్లు లోక్‌సభకు, 2 సార్లు రాజ్యసభకు ఎన్నిక కావడం చాలా పెద్ద విషయమని భట్టీ అన్నారు. ఆయన ఎంతో క్రమశిక్షణ గల నాయకులు కాబట్టే ఇదంతా సాధ్యమైందని.. ఆయన జీవితాన్ని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని భట్టీ పిలుపునిచ్చారు. అలాంటి గొప్ప నాయకులు కరోనా బారినపడి మరణించడం చాలా దురదృష్టకరమన్నారు. నంది ఎల్లయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తానని విక్రమార్క తెలిపారు.

# కృష్ణాలో పుట్టి మునిగి నలుగురు గల్లంతు

## -గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు

నారాయణపేట,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): జిల్లాలోని మక్తల్ మండలం పసుపుల గ్రామం వద్ద కృష్ణానదిలో పుట్టి మునిగింది. ఈ ఘటనలో నలుగురు గల్లంతయ్యారు. నారాయణపేట జిల్లా పస్పుల గ్రామం నుంచి సుమారు 15 మంది కూలీలు పుట్టిల్లో కర్ణాటక రాష్ట్రంలోని కురవాపురం గ్రామానికి బయల్దేరారు. నిత్యావసర సరకుల కోసం పంచదేవ్ పాడుకు వచ్చి నదిని దాటుతుండగా వారు ప్రయాణిస్తున్న పుట్టి మునిగింది. దీన్ని గమనించిన స్దానికులు మరో పుట్టిల్లో వెళ్లి 11 మందిని కాపాడారు. నలుగురు గల్లంతవ్వగా. వారంతా మహిళలుగా స్థానికులు చెబుతున్నారు. గాలింపు చర్యలు చేపట్టారు. కాగా కృష్ణానదిలో రెండున్నర లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు ప్రవహిస్తుంది. దీంతో గల్లంతైన వారి ఆచూకీపై ఆందోళన వ్యక్తం అవుతుంది. అయతే వల్లభాపురం దత్తాత్రేయ స్వామి దర్శనం కోసం నిత్యం భక్తులు పుట్టిల్లోనే ప్రమాదకర ప్రయాణం కొనసాగిస్తారు. గల్లంతయిన వారి కోసం సహాయక అధికారులు చర్యలు చేపట్టారు. మక్తల్ మండలం వల్లభాపురం దగ్గర కృష్ణానదిలో ఘటన జరిగింది. పస్పుల నుంచి కురువపురం వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు సమాచారం. కొంతమందిని మరో పుట్టిలోని ప్రయాణికులు కాపాడారు. గల్లంతయిన వారు కర్ణాటక రాష్ట్రానికి చెందిన పెద్దకురువపురం వాసులుగా గుర్తించారు. మక్తల్‌కు నిత్యావసర సరుకుల కోసం వచ్చి వెళ్తుండగా ఘటన జరిగినట్లు తెలుస్తోంది.

# గోదావరి వరద పట్ల అప్రమత్తంగా ఉండాలి

## -అధికారులతో సమీక్షలో మంత్రి పువ్వాడ హెచ్చరిక

ఖమ్మం,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): గోదావరి వరద ఉధృతిని ఎదుర్కొనేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఎంవిరెడ్డి, ఎస్పీ సునీల్‌దత్, ఇతర ప్రభుత్వ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. జిల్లాలో వర్షాలు విస్తారంగా కురవడం వల్ల ఎగువ వరద అధికంగా రావడంతో వరద ఉధృతి ఎప్పటికప్పుడు పెరుగుతుంది కాబట్టి అధికారులు అన్నివేళలా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ముంపు పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను సరక్షితంగా పునరావాస కేంద్రాలకుతరలించాలని వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు ఏర్పాటుచేయాలని సూచించారు. అందరికీ నాణ్యమైన భోజనం, శుభ్రమైన త్రాగునీరు అవసరమైన వారికి మందులు అందించాలన్నారు. కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ప్రభుత్వ విప్ సారపాక, ఎమ్మెల్యే రేగా కాంతారావు, భద్రాచలం ఎమ్మెల్యే పొడెంవీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# సైదాపూర్ వాగువద్ద తప్పిన ప్రమాదం

## -ఇద్దరు యువకులను కాపాడిన మత్స్యకారులు

కరీంనగర్,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ): కరీంనగర్ జిల్లా సైదాపూర్ వద్ద తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. వరదలో బైక్‌తో సహా ఇద్దరు యువకులు కొట్టుకుపోతుండగా మత్స్యకారులు కాపాడారు. సైదాపూర్-జాగిర్ పల్లి మధ్య చెరువు మత్తడి దూకడంతో లెవెల్‌లో ఉన్న కల్వర్టు వద్ద వరద ఉధృతి ఎక్కువైంది. ఇద్దరు యువకులు కల్వర్టు దాటే ప్రయత్నం చేయగా జారి వరదనీటిలో బైక్‌తో సహా పడిపోయారు.

అక్కడే చేపలు పడుతున్న మత్స్యకారులు గమనించి వెంటనే వారిని కాపాడారు. తాడు సహాయంతో బయటికి లాగారు. బైక్‌తో సహా ఒడ్డుకు లాగిన మత్స్యకారులు ప్రమాదానికి గురైన యువకులను ఎక్కడివారు అని అడిగితే సమాధానం చెప్పకుండా బైక్‌పై పారిపోయారు. ఎక్కడి వారు ఎవరు ఆ యువకులు అనేది స్పష్టంగా తెలియకపోయినప్పటికీ సమయస్ఫూర్తితో ఇద్దరు యువకులు ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ యువకుల ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు.

# కమలకు హిందూ సంప్రదాయాలపై మక్కువ

## -అటార్నీ ఎన్నికల సందర్భంగా 108 కొబ్బరికాయలు కొట్టిన పిన్ని

వాషింగ్టన్,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): అమెరికా అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో డెమొక్రటిక్ పార్టీ తరపున వైస్ ప్రెసిడెంట్ రేసులో నిలిచిన కమలా హారిస్(55) భారత మూలాలకు సంబంధించి సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. తమిళనాడుకు చెందిన పీవీ గోపాలన్ మనుమరాలైన కమల అగ్రరాజ్యంలో ఇప్పటికే పలు కీలక బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉపాధ్య పదవికి పోటీ పడుతున్న తొలి నల్లజాతి మహిళగా ఇటీవలే ఆమె మరో సరికొత్త చరిత్ర సృష్టించారు. ఈ నేపథ్యంలో జమైకా మూలాలతో పాటు భారత్‌తో కమలకు ఉన్న బంధం, భారత సంస్కృతీ సంప్రదాయాల పట్ల ఆమెకున్న విశ్వాసం గురించి వార్తలు వెలుగులోకి వస్తున్నాయి. 2010 కాలిఫోర్నియా అటార్నీ ఎన్నికల సమయంలో తన గెలుపును ఆకాంక్షిస్తూ, కొబ్బరికాయలు కొట్టాల్సిందిగా కమల తన చిన్నమ్మ సరళా గోపాలన్‌ను అడిగినట్లు న్యూయార్క్ టైమ్స్ ఓ కథనం ప్రచురించింది. కమల వ్యక్తిత్వాన్ని మలచడంలో ఆమె భారతీయ కుటుంబం కీలక పాత్ర పోషించిందంటూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది.

కాగా కమలా హారిస్ తల్లి శ్యామలా గోపాలన్ చెన్నైకి చెందిన వారన్న సంగతి తెలిసిందే. తమిళనాడు సంప్రదాయ కుటుంబానికి చెందిన శ్యామల భారత్‌కు వచ్చినప్పుడల్లా పిల్లల్ని వెంట తీసుకువచ్చేవారు. అలా కమలకు చెన్నైతో అనుబంధం ఏర్పడింది. తన తాతయ్య గోపాలన్‌తో కలిసి ఆమె బీసెంట్ నగర్ బీచ్‌లో సేద తీరుతూ వాకింగ్ చేసేవారు.

ఆ సమయంలో హిందుత్వానికి సంబంధించిన పలు విషయాలు అడిగి తెలుసుకునేవారు. అలా భారతీయ సంప్రదాయాల పట్ల ఆమెకు నమ్మకం కుదిరింది. ఈ క్రమంలో తను అటార్నీ జనరల్‌గా పోటీ పడిన సమయంలో చెన్నైలో ఉండే చిన్నమ్మ సరళా గోపాలన్‌ను 108 కొబ్బరికాయలు కొట్టమని చెప్పారు. ఈ విషయాల గురించి 2018 నాటి ప్రసంగంలో కమల చెప్పుకొచ్చారు. తన తాతయ్య ఎన్నో కథలు చెప్పేవారని, ప్రజాస్వామ్య విలువల గురించి బోధించేవారని పేర్కొన్నారు. ఈరోజు తాను ఇలా ఉన్నానంటే అందుకు తాతయ్య మాటలే కారణమంటూ ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు.

# కరోనా నుంచి కోలుకున్న మేఘ్వాల్

న్యూఢిల్లీ,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): కేంద్ర నీటి వనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ కరోనా నుంచి కోలుకున్నారు. ఢిల్లీలోని ఎయిమ్స్ దవాఖాన నుంచి సోమవారం డిశ్చార్జ్ అయ్యారు. అర్జున్ రామ్ మేఘ్వాల్‌కు ఈ నెల 8న కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో నాటి నుంచి ఢిల్లీ ఎయిమ్స్ దవాఖానలో చికిత్స పొందిన ఆయన కరోనా నుంచి కోలుకోవడంతో సోమవారం డిశ్చార్జ్ చేసినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ గత నెలలో 'భాభిజీ' పేరుతో అప్పడాలను ఆవిష్కరించారు. ఈ అప్పడాలను తింటే శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచే యాంటీబాడీలు తయారవుతాయని దీంతో కరోనాను నియంత్రిస్తుందని పేర్కొన్నారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు వివాదస్పదమయ్యాయి.

# హరితహారంలో మొక్కలు నాటిన మంత్రి అల్లోల



నిర్మల్ జిల్లాలోని కొండాపూర్‌లో గల తెలంగాణ రాష్ట్ర సమితి కార్యాలయం ఆవరణలో మంగళవారం హరితహారంలో భాగంగా మొక్కలను నాటిన అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ ఆగష్టు 18: జిల్లాలోని కొండాపూర్ లో గల తెలంగాణ రాష్ట్ర సమితి కార్యాలయం ఆవరణలో మంగళవారం అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరో విడత తెలంగాణకు హరితహారంలో భాగంగా మొక్కలను నాటారు. అనంతరం తెలంగాణ భవన్ పనులను మంత్రి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..మొక్కలు విరివిగా నాటాలన్నారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందన్నారు. అలాగే టీఆర్ఎస్ భవన నిర్మాణ పనులు గడువులోగా పూర్తి చేయాలన్నారు. మంత్రి వెంట ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

# మూసీగేట్లు ఎత్తివేతతో సందర్శకుల తాకిడి

నల్గొండ,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): మూసీ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో అధికారులు నాలుగు గేట్లను రెండున్నర ఫీట్ల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తేయడంతో సందర్శకుల తాకిడి పెరిగింది. ప్రజలు తరలి రావడంతో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. గేట్లు ఎత్తేయడంతో ప్రాజెక్ట్ వద్ద అందాలు కనువిందు చేస్తున్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా, ప్రస్తుతం 643.20 అడుగుల మేర నిండింది. మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.99 టీఎంసీలు నిండింది. ఎగువ నుంచి వరద వస్తుండడంతో 2, 4, 7, 9వ నంబర్ల గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నల్గొండలోని నాగార్జునసాగర్ జలాశయానికి స్థానికంగా

## సాగర్‌కు కొనసాగుతున్న వరదప్రవాహం

కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ నుంచి వరద వస్తోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 40,259 క్యూసెక్కులు ఉండగా, 4,107 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. పూర్తిస్థాయి నీటి నిల్వ 312.0405 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 254.2161 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మొత్తంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద కొనసాగుతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 590.00 అడుగులు కాగా...ప్రస్తుత నీటిమట్టం 569 .10 అడుగులకు చేరింది. ఉప్పొంగుతున్న వాగులు, వంకలు.. మత్తడి దుంకుతున్న చెరువులు, కుంటలు.. నిండుకుండను తలపిస్తున్న శాలిగౌరారం, డిండి, మూసీ, నాగార్జునసాగర్ రిజర్వాయర్లు... వెరసి ఉమ్మడి నల్లగొండ జిల్లా కనుచూపు మేర జలకళ సంతరించుకుంది. వారంరోజులుగా ఎడతెరిపిలేని వర్షాల కారణంగా ఆగస్టులోనే చిన్న, మధ్యతరహా, భారీ ప్రాజెక్టులన్నీ కళకళలాడుతున్నాయి. దీంతో ప్రస్తుతం సాగునీటికి ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు భవిష్యత్‌లోనూ ఢోకా ఉండబోదన్న ధీమా వ్యక్తమవుతోంది. ఇక నాన్‌ఆయకట్టులోనూ భూగర్భజలాలు ఊటెక్కి వస్తున్నాయి. పాతాళగంగ పైపైకి ఎగిసివస్తున్నది. మొత్తంగా ఈ ఏడాది సాగు,తాగునీటికి సమస్య లేనట్లేనని అధికారులు తెలిపారు.

# ఛతర్‌పూర్ వద్ద రోడ్డు ప్రమాదం : ముగ్గురు దుర్మరణం



భోపాల్, ఆగష్టు 18: ఛతర్‌పూర్ సాగర్–కాన్పూర్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. నాగర్ గారిమల్‌హారా సమీపంలో కారు, ట్రక్కును ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలు సహా ముగ్గురు వ్యక్తులు మరణించారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వీరి ఇద్దరు పిల్లలు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం, మహారాజ్‌పూర్ తహసీల్ ప్రాంతంలోని సింగ్పూర్ గ్రామంలో నివసిస్తున్న జంగ్‌బహదూర్ సింగ్ రాజ్‌పుత్, తన భార్య, ఇద్దరు పిల్లలను.. రోహిత్ తివారీతో కలిసి ఇండిగో కారులో చిత్రకూట్ ధామ్ వెళ్లేందుకు బయల్దేరారు. సోమవారం సాయంత్రం వరకు చిత్రకూట్‌ను సందర్శించిన తరువాత.. అర్ధరాత్రి వేళ తిరుగు ప్రయాణం మొదలెట్టారు. జంగ్ బహదూర్ సింగ్ రాజ్‌పుత్ కారు నడుపుతున్నాడు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో కారు గారిమల్‌హారా నుంచి కొద్ది దూరంలో ఉండగా ఒక జంతువును రక్షించే ప్రయత్నంలో ఛతర్‌పూర్ నుంచి వస్తున్న ట్రక్కును ఢీకొట్టారు. ఈ ఘటనలో జంగ్‌బహదూర్ సింగ్ (35), అతడి భార్య విశాఖ (30), రోహిత్ తివారీ (22) అక్కడికక్కడే మరణించారు. రాజ్‌పుత్ దంపతుల పిల్లలు దీపక్, దీపికలకు తీవ్ర గాయాలయ్యాయి.

ప్రమాదానికి సంబంధించిన సమాచారం అందుకున్న గారిమలహార పోలీస్ స్టేషన్ ఇంఛార్జి అతుల్ దీక్షిత్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన ఇద్దరు పిల్లలను వెంటనే జిల్లా దవాఖానకు తలలించారు. రాజ్‌పుత్ దంపతులు, రోహిత్ తివారీ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మహారాజ్‌పూర్ దవాఖానలో ఉంచారు.

# కేరళ గోల్డ్ స్కామ్‌లో కీలక మలుపు

## ఐఏఎస్ అధికారి గల్ఫ్ వెళ్లినట్లు గుర్తించిన ఇడి

తిరువనంతపురం,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): కేరళ గోల్డ్ స్కామ్ కేసు మరో కీలక మలుపు తిరిగింది. బంగారం స్మగ్లింగ్ చేసిన స్వప్న సురేష్‌తో పాటు సస్పెండ్ అయిన ఐఏఎస్ అధికారి శివశంకర్ మూడు సార్లు గల్ఫ్ దేశాలకు వెళ్లినట్లు విచారణలో వెల్లడైంది. 2017 – 2018లో మూడు దఫాలుగా శివశంకర్‌తో కలిసి గల్ఫ్‌కి వెళ్లినట్లు ఈడీ తెలిపింది. శివశంకర్ సూచనల మేరకు జాయింట్ బ్యాంక్ లాకర్‌లో డబ్బులు దాచి పెట్టినట్లు ఈడీ పేర్కొంది. మరింత లోతైన దర్యాప్తు కోసం స్వప్న సురేష్, సందీప్ నాయర్, సరిత్‌ను ఆగస్టు 26 వరకు నిందితులను జ్యుడీషియల్ కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోరింది.

# కలెక్టర్లతో సీఎం జగన్ వీడియో కాన్ఫరెన్స్

## వరద ప్రాంతాల పరిస్థితులపై ఆరా

## సహాయ కార్యక్రమాలు కొనసాగించాలని ఆదేశం

అమరావతి,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టాలని సిఎం వైఎస్ జగన్ ఆదేశించారు. అలాగే ప్రజాప్రతినిధులు కూడా సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని అన్నారు.

గోదావరి వరద పరిస్థితులపై ఉభయగోదావరి జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరద పరిస్థితులపై కలెక్టర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అధికారులంతా సహాయ పునరావాస కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. నేను ఏరియల్ సర్వేకు వెళ్తున్నాను. నేను వెళ్తున్నాను కాబట్టి మీరు సహాయ పునరావాస కార్యక్రమాలను వదిలిరావాల్సిన అవసరంలేదు. అందుకే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్నానని సీఎం జగన్ తెలిపారు. ముంపు బాధితుల కుటుంబాలకు ఒక్కొంటికి రూ. 2 వేల చొప్పున సహాయం అందించాలని సీఎం ఆదేశించారు. ముంపు బాధితుల పట్ల మానవత్వంతో, ఉదారంగా వ్యవహరించాలని ఆయన కోరారు. మన ఇంట్లో సమస్యగానే భావించి వారికి అండగా నిలవాలని పేర్కొన్నారు. ఖర్చు విషయంలో వెనుకాడ వద్దని సీఎం స్పష్టం చేశారు. వరద సహాయ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం కావాలన్నారు.. వారు ఇస్తున్న క్షేత్రస్థాయి సమాచారంపై వెంటనే చర్యలు తీసుకోవాలి. వారు ఇచ్చే సమాచారం తీసుకోవడంపై ఒక అధికారిని కూడా పెట్టండి. క్షేత్రస్థాయిలో వారు గమనించిన అంశాలను వెంటనే పరిష్కరించండి. ఈ రాత్రికి 17 లక్షల క్యూసెక్కులకు, రేపు ఉదయానికి 12 లక్షల క్యూసెక్కులకు, ఎల్లుండికి 8 లక్షల క్యూసెక్కులకు వరద తగ్గుతుందన్న సమాచారం వస్తోంది. వరద తగ్గుముఖం పట్టగానే 10 రోజుల్లో పంట నష్టం అంచనాలు పంపించాలి. ఎన్యుమరేషన్ 10 రోజుల్లోగా చేయాలి. విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు.

# జూరాలకు కొనసాగుతున్న వరద

గద్వాల, ఆగస్ట్ 18 (ఆర్ఎన్ఎ):ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో గువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూఐర్ ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతుండడంతో అదే స్థాయిలో వదర నీటిని దిగువన ఉన్న జూరాలకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో జూరాల క్రస్టు గేట్లను పెంచుతూ వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# ఆర్వోబీ పనులు త్వరగా పూర్తి చేయాలి

## క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి పువ్వాడ




ఖమ్మంలో నిర్మాణంలో ఉన్న ఆర్వోఆర్ బ్రిడ్జి పనులను పరిశీలించిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

ఖమ్మం,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): ఖమ్మంలో ఆర్వోబి పనులను త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను మంత్రి పువ్వాడ అజయ్ ఆదేశించారు. పనులను తొందరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో నాణ్యత లోపించకుండా సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్పొరేషన్ 13వ డివిజన్ నుంచి ఖమ్మం బోనకల్ కు అనుసంధాన రోడ్డు రూ.74 కోట్లతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న దంసలాపురం ఆర్వోబీ బ్రిడ్జి నిర్మాణ పనులను రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పరిశీలించారు. అప్రోచ్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్, ఫోర్ లైన్ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పురపాలక మంత్రి కేటీఆర్ చేతుల మీదగా బ్రిడ్జిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. మంత్రి వెంట ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు. ఇదిలావుంటే రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. రెండు జిల్లాలకు చెందిన కలెక్టర్లతో మాట్లాడుతూ.. పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారు. ప్రజా రవాణా, సరుకు రవాణాకు, ప్రాణ, ఆస్తి నష్టం కలుగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్, భద్రాద్రా జిల్లా ఎస్పీలకు మంత్రి సూచిం చారు. ఆయా జిల్లాల అధికార యంత్రాం గాన్ని అనుక్షణం అప్రమత్తం చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజక వర్గాల వారిగా సమాచారం తెలుసుకొని, తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి పువ్వాడ సూచనలు చేస్తున్నారు. ప్రస్తుతం భద్రాచలంలో గోదావరి ఉధృతి కొంచెం తగ్గింది. ఎగువున కురుస్తున్న వర్షాల వలన వరద తీవ్రత ఎక్కువయ్యే ప్రమాదం ఉందని, దానికి తగ్గట్టు లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవా లని, ఎలాంటి పరిస్థి తులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికార యంత్రాంగానికి సూచించారు. రాబోయే మూడు రోజులు పాటు భారీ వర్షాలు కురుస్తాయ'ని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యం లో కలెక్టర్ల ద్వారా సమాచారం తెలుసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు ఆయా పరిస్థితులను తెలుసుకొని ప్రభుత్వానికి నివేదిస్తున్నారు.

# మెరుగుపడ్డ ఎస్పీ బాలు ఆరోగ్యం

## వెంటిలేటర్ తొలగించి ఐసియూలోనే చికిత్స

## వెల్లడించిన సోదరి ఎస్పీ శైలజ

చెన్నై,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): సంగీత ప్రియులకి శుభవార్త. కొద్ది రోజులుగా బాలు ఆరోగ్యం విషయంలో ఆందోళనకు గురవుతున్న అభిమానులకి ఎస్పీబీ సోదరి శైలజ శుభవార్త అందించారు. అన్నయ్యకి వెంటిలేటర్ తొలగించారు. ప్రస్తుతం ఐసీయూలోనే ఉన్నప్పటికీ ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిపారు. ఆరోగ్య పరిస్థితిలో కూడా మెరుగుదల కనిపిస్తోంది. అతని కోలుకోవాలని ప్రార్థిస్తున్న అభిమాలను ఒదరి ఈ సందర్భంగా శైలజ కృతజ్ఞతలు తెలిపింది. బాలు ఆరోగ్యం మెరుగుపడుతఃండటంపై వైద్యులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులు క్రితం బాలు ఆరోగ్య పరిస్థితి క్షీణించిందని, ఆయనని వెంటిలేటర్‌పై ఉంచినట్టు వైద్యులు హెల్త్ బులిటెన్‌లో తెలిపారు. బాలు త్వరగా కోలుకోవాలని అభిమానులు, పలువురు సినీ ప్రముఖులు ఎంతగానో ప్రార్థిస్తున్నారు. ఆయన కోసం వార్డ్‌లో పాటలు కూడా ప్లే చేస్తున్నారట వైద్యులు. గాన గంధర్వుడు బాల సుబ్రహ్మణ్యం కరోనాతో చెన్నైలోని ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ఆయన ఆరోగ్యం కాస్త క్షీణించడంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని బాలు తనయుడు చరణ్ సోమవారం ఓ వీడియో ద్వారా తెలియజేశారు. తాజా సమాచారం ప్రకారం ఐసీయూలో చికిత్స పొందుతున్న బాలుసుబ్రహ్మణ్యంకు తను పాడిన పాటలని వినిపిస్తున్నారని సమాచారం. బాలు త్వరగా కోలుకోవాలని ఆయన ఉన్న వార్డులో పాటల్ని ఆడియో ద్వారా ప్రసారం చేస్తున్నట్లుగా వైద్యులు చెబుతున్నారు. ఐదు దశాబ్దాల పాటు అలరించిన బాలు త్వరగా కోలుకోవాలని తమిళనాడు ఉప ముఖ్యమంత్రి పన్నీరుసెల్వంతో పాటు.. ప్రముఖ నటులు రజనీ కాంత్.. కమల్ హాసన్, చిరంజీవి తో పాటు పలు రాజకీయ.. సినిమా రంగానికి చెందిన ప్రముఖులు కోరుకుంటున్నారు.కాగా, బాలు సతీమణి సావిత్రి కూడా కరోనా వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే.

# సుశాంత్ కేసులో కొనసాగుతున్న దర్యాప్తు

## తండ్రి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసిన అధికారులు

## సుశాంత్ ఖాతాల నుంచి నగదు మాయంపైనా ఆరా

న్యూఢిల్లీ, ఆగస్ట్ 18(ఆర్ఎన్ఎ): బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా సుశాంత్ తండ్రి కేకే సింగ్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసింది. ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి పిలిపించిన అధికారులు ఈ సందర్భంగా పలు ప్రశ్నలను ఆయనను అడిగారు. సుశాంత్ బ్యాంకు ఖాతాల నుంచి నగదు మాయమైనట్లు ఎలా తెలిసిందని ఆరా తీశారు. అలాగే సుశాంత్ ఖాతాల నుంచి నటి రేహా చక్రవర్తికి రూ. 15 కోట్లు బదిలీ అయినట్లు ఎలా గుర్తించారని ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు కేకే సింగ్ ఇచ్చిన సమాధానాలను ఈడీ అధికారులు రికార్డు చేశారు. దర్యాప్తులో భాగంగా ఇటీవల నటి రేహా చక్రవర్తి, ఆమె సోదరుడితోపాటు సుశాంత్ ఆర్థిక వ్యవహారాలు చూసే మేనేజర్, స్నేహితుడు సిద్ధార్థ్ పితాని నుంచి కూడా స్టేట్‌మెంట్లను ఈడీ రికార్డు చేసింది. సుశాంత్ సింగ్‌తో సహజీవనం చేసినట్లు చెబుతున్న నటి రేహా చక్రవర్తి, ఆమె కుటుంబ సభ్యులకు తన కుమారుడి బ్యాంకు ఖాతాల నుంచి నగదు బదిలీ అయ్యాయని, తన కుమారుడి మరణానికి వారే కారణమంటూ కేకే సింగ్ బీహార్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఈ కేసు దర్యాప్తు విషయం మహారాష్ట్ర, బీహార్ పోలీసుల మధ్య వివాదం రేపింది. ఈ నేపథ్యంలో సుశాంత్ మరణం కేసు దర్యాప్తును బీహార్ ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది. అయితే మహారాష్ట్రలో జరిగిన ఘటనకు సంబంధించిన కేసుపై ఇతరుల జోక్యాన్ని సహించబోమని ఆ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సుశాంత్ మరణం వెనుక చాలా కారణాలు ఉన్నాయని పేర్కొంది.

# విషమంగానే ప్రణబ్ ఆరోగ్యం

## ఇంకా మెరుగు పడలేదన్న వైద్యులు

న్యూఢిల్లీ,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆరోగ్య పరిస్థితి మంగళవారం కూడా విషమంగానే ఉందని ఆర్మీ వైద్యులు తెలియజేశారు. ఆయన ఆరోగ్యం విషయంలో ఎలాంటి పురోగతి లేదని తెలుస్తోంది. ఆర్మీ రీసెర్చ్ అండ్ రెఫరల్ దవాఖానలో వెంటిలేటర్ మీద ఆయన చికిత్స పొందుతున్నారు. మెదడులో రక్తం గడ్డకట్టడంతో శస్త్ర చికిత్స చేసిన తరువాత ప్రణబ్ ముఖర్జీ పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. శస్త్రచికిత్సకు ముందు ప్రణబ్‌కు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయిన సంగతి తెలిసిందే. నిపుణుల వైద్య బృందం ప్రణబ్‌కు ప్రత్యేక చికిత్స అందజేస్తోంది. ఈ నెల10న మధ్యాహ్నం ప్రణబ్‌ను దవాఖానకు తరలించారు. ప్రణబ్ ముఖర్జీ ఆరోగ్య పరిస్థితి గురించి దేశం మొత్తం ఆందోళన చెందుతోంది. ప్రణబ్ కుమార్తె ఇటీవల మాట్లాడుతూ ఆగస్టు 15న తన తండ్రి తీవర్ణ పతాకాన్ని ప్రతి సంవత్సరం ఎగుర వేసేవారని, వచ్చే ఏడాది కూడా ఆయన జెండా ఎగురవేస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు




వేములవాడ, ఆగష్టు 18 బహుజనుల ఆశాజ్యోతి, భారతదేశం గర్వించదగ్గ వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 370వ జయంతి వేడుకలను వేములవాడ అర్బన్ మండలంలోని రుద్రవరం గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు, సర్పంచ్ ఉరడి రామ్ రెడ్డి ,ఎంపీటీసీ గాలి పెల్లి సువర్ణ స్వామి,ఉప సర్పంచ్ తాడెం శ్రీనివాస్ , గౌడ సంఘం అధ్యక్షుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజనల ఆశాజ్యోతి, గౌడ కులస్తుల ముద్దుబిడ్డ సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు, ఈ సందర్భంగా పాపన్న విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు,

ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, మాజీ సర్పంచులు ,ఎంపిటిసిలు , సింగిల్ విండో డైరెక్టర్లు, వివిధ కుల సంఘాల అధ్యక్షులు ,కార్యదర్శులు ,గౌడ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

# 47వ డివిజన్ లో కూలిన ఇండ్లను పరిశీలించిన తహశీల్దార్

## బాధితులను ఆదుకోవాలని తహశీల్దార్ కు కార్పొరేటర్ శర్ఫుద్దీన్ విజ్ఞప్తి



వేములవాడ, ఆగష్టు 18గత 7రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు 47వ డివిజన్ పరిధిలోని పలు ఇండ్లు కూలిపోయాయి. బాధితులను ఆదుకోవాలని మంగళవారం కార్పొరేటర్ మహమ్మద్ శర్ఫుద్దీన్ కరీంనగర్ అర్బన్ తహశీల్దార్ వెంకటరెడ్డి కి విజ్ఞప్తి చేశారు. ఈనేపథ్యంలో కార్పొరేటర్ శర్ఫుద్దీన్ విజ్ఞప్తి కి స్పందించిన తహశీల్దార్ వెంకటరెడ్డి 47వ డివిజన్ లో పర్యటించారు. కూలిపోయిన ఇండ్లను పరిశీలించారు. బాధితుల సమస్యలు తెలుసుకున్నారు. తక్షణ పరిహారంగా బాధితులకు బియ్యం పంపిణీ చేశారు. కూలిన ఇండ్లకు పరిహారం త్వరితగతిన ఇప్పించేందుకు కృషి చేస్తానని తహశీల్దార్ వెంకటరెడ్డి కార్పొరేటర్ శర్ఫుద్దీన్ కు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్ ఐ అన్వరుల్లాహ్, విఆర్వో, డివిజన్ పెద్దలు పాల్గొన్నారు.

# పోలవరం ముంపు బాధితుల గోడు పట్టించుకునేదెవరు?

## ఆరేళ్లయినా పట్టించుకోని ప్రభుత్వాలు

ఏలూరు,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ): పోలవరం ముంపు బాధితులకు సరైన న్యాయం దక్కడం లేదు. అనేక సమస్యలపై దృష్టి సారించిన సిఎం జగన్ ఇప్పుడు వీరి విషయంలో ఎలాంటి చొరవా చూపడం లేదు. ఉభయ గోదావరి జిల్లాల్లోని 8 మండలాల్లో 373 గ్రామ పంచాయతీలకు చెందిన 1,05,601 కుటుంబాలు మునిగిపోతున్నాయి. ఇప్పటికి 17 పంచాయతీల్లోని 3,110 కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించారు. మిగిలిన 356 పంచాయతీల్లోని లక్షకు పైబడి కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి వున్నా ఇంకా అడుగు ముందుకు పడలేదన్న విమర్శలు ఉన్నాయి. గిరిజనులకు భూమికి భూమి కేటాయిస్తామని గొప్పలు చెప్పిన పాలకులు ఏ ఒక్కరికీ సెంటు భూమి ఇవ్వలేదు. అన్యం పుణ్యమెరుగని అడవి బిడ్డలకు ఇంత ద్రోహం చేయడం పాలకులకు తగునా? కనీసం ప్రాజెక్టుకు ఆనుకుని ఉన్న గ్రామాల నిర్వాసితులకైనా పునరావాస కాలనీలు నిర్మించి ఆదుకుంటారని ఆశించినవారి ఆశలూ అడియాసలయ్యాయి. పునరావాసం కింద ఇప్పటి వరకు నాలుగంటే నాలుగు ఇళ్లే పూర్తి స్థాయిలో పూర్తయ్యాయంటే అణగారిన ప్రజల పట్ల సర్కార్ నిర్లక్ష్య ధోరణిని అర్థం చేసుకోవచ్చు. గత సంవత్సరం గోదావరి వరదలకు దేవీపట్నం, తొయ్యూరు, అగ్రహారం, వీరవరం సహా 36 గ్రామాలు మూడు నెలలు పాటు ముంపు లోనే మగ్గిపోయాయి. ఇంటికి రూ.5 వేల నష్ట పరిహారం ఇస్తామన్న ప్రభుత్వం నేటికీ చిల్లిగవ్వ ఇచ్చింది లేదు. ఈ ముంపునకు ప్రధాన కారణం దేవీపట్నం వద్ద నిర్మించిన కాఫర్ డ్యామే. పునరావాసం కల్పించకుండా కాఫర్ డ్యామ్ నిర్మించొద్దని అప్పట్లో వామపక్షాలు, ప్రజా సంఘాలు నెత్తి నోరు మొత్తుకున్నా నాటి చంద్రబాబు ప్రభుత్వం పెడచెవిన పెట్టగా..వైసిపి ప్రభుత్వమూ ఆ తోవలోనే నడుస్తోంది. పునరావాస పనుల నాణ్యతపై దృష్టి సారించి వేగం పెంచాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి.. తాను అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా నిర్వాసితులకు ఇచ్చిన హామీలు ఏ మేరకు అమలు జరిగాయన్నది పట్టించుకోవడం లేదు. పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద గత టిడిపి ప్రభుత్వం కుటుంబానికి రూ. 6.36 లక్షలు చెల్లిస్తామని ప్రకటించగా ఎన్నికల ప్రచారంలో తప్పుబట్టిన జగన్ తాను అధికారంలోకి రాగానే ఒక్కో కుటుంబానికి పరిహారాన్ని రూ. పదిన్నర లక్షలకు పెంచుతానని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఈ హామీ ఏమైందనేది కూడా తెలియడం లేదు. భూసేకరణ చట్టం ప్రకారం ముందు నిర్వాసితులకు న్యాయం చేయాలి. ఆ తర్వాతే ప్రాజెక్టును ముందుకు సాగించాలి. పోలవరం విషయంలో ప్రభుత్వాలన్నీ కూడా నిర్వాసితులకు న్యాయం చేయడం అటుంచి నిలువునా వంచిస్తూనే వస్తున్నాయి. విలీన మండలాల ప్రజల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. తెలంగాణ అధికార యంత్రాంగమంతా ఆయా మండలాల నుంచి వెళ్లిపోయింది. వైకాపా ప్రభుత్వం నియామకాలపై దృష్టి సారించకపోవడంతో వైద్యం వంటి కనీస సదుపాయాలన్నీ పడకేశాయి. కరోనా కేసులు, మరణాలు ఉభయ గోదావరి జిల్లాల్లో పెరిగిపోతుండటానికి ఈ నిర్లక్ష్యమే కారణం.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
Editor: B. Devadas, Cell: 9000065433
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.